ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
అన్నమయ్య
జిల్లా వార్తలు
5
సోమవారం 1 డిసెంబరు 2025



కేసుల్లో కోర్టుకు హాజరైన శ్రీరామ్ చినబాబు, పర్వీన్‌తాజ్, రాటకొండ మధుబాబు (ఫైల్)

నేటి పీజీఆర్ఎస్ రద్దు

రాయచోటి (నేతాజీ సర్కిల్)/టౌన్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): దిత్వా తుఫాను నేపథ్యంలో కలెక్టరేట్‌లో, ఎస్పీ కార్యాలయంలో నేడు ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) కార్యక్రమాన్ని తాత్కాలికంగా రద్దు చేస్తున్నట్లు కలెక్టర్ నిశాంత్‌కుమార్, ఎస్పీ ధీరజ్ కునుబిల్లిలు ఆదివారం వేర్వేరు ప్రకటనల్లో పేర్కొన్నారు. అర్జీదారులు ఈ విషయాన్ని గమనించి స్పందన ఫిర్యాదులను సమర్పించేందుకు కలెక్టరేట్, ఎస్పీ కార్యాలయాలకు రావద్దని వారు ఆ ప్రకటనలో తెలిపారు.

వర్షంలోనూ ఆవాస్ ప్లస్ సర్వే



పీలేరు పెద్దమసీదు వీధిలో ఆవాస్ ప్లస్ సర్వేను పరిశీలిస్తున్న హౌసింగ్ డీఈ రమణయ్య

పీలేరు, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): పీలేరులో ఆదివారం ఉదయం నుంచి రాత్రి వరకు వర్షం కురుస్తున్నప్పటికీ ఆవాస్ ప్లస్ సర్వే ఉధృతంగా కొనసాగింది. సర్వేలో పాల్గొనేందుకు ఆదివారం చివరిరోజు కావడంతో పీలేరు పట్టణ ప్రజలు వర్షాన్ని సైతం లెక్కచేయకుండా తమ వివరాలు నమోదు చేసుకున్నారు. పీలేరు పట్టణంలోని 5 సచివాలయాల పరిధిలోని సిబ్బందిని హౌసింగ్ డీఈ రమణయ్య ఆదివారం ఉదయం నుంచి తమకు నిర్దేశించిన ప్రాంతాలకు వెళ్లి సర్వే చేసేలా పటిష్ఠ చర్యలు చేపట్టారు. దీంతో ఆదివారం పీలేరు పట్టణంలోని అన్ని వీధుల్లో సర్వే సందడి నెలకొంది.

బాహుదా గేట్లు ఎత్తివేత

● లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి



బాహుదా గేట్లు ఎత్తి నీటిని దిగువకు విడుదల చేస్తున్న దృశ్యం

నిమ్మనపల్లి, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ముష్టూరు పంచాయతీలో గల బాహుదా ప్రాజెక్టు పూర్తి స్థాయిలో నిండడంతో ఆదివారం ఇరిగేషన్ అధికారులు రెండు గేట్లను ఎత్తి 50 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేశారు. ఈ సందర్భంగా ఎస్ఐ తిప్పేస్వామి ప్రాజెక్టు పరిసర ప్రాంతాలను పరిశీలించి దిత్వా తుఫాన్ కారణంగా పర్యాటకులు ప్రాజెక్టు వద్దకు రావద్దని హెచ్చరికలు జారీ చేశారు. ప్రాజెక్టు గేట్లు ఎత్తడం వలన లోతట్టు ప్రాతాలలో ఉండే ప్రజలు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. నీటి ప్రవాహం ఎక్కువగా ఉండే సమయంలో వాహనదారులు, పాదచారులు వంతెనలను దాటరాదని తెలిపారు. ఎలాంటి ప్రమాదాలు జరిగినా వెంటనే సమాచారం ఇవ్వాలని తెలిపారు. ఇరిగేషన్ ఏఈ శ్రీహరిరెడ్డి మాట్లాడుతూ మూడు రోజుల పాటు దిత్వా తుఫాన్ ప్రాభవం ఉంటుందని, నీటి ప్రవాహాన్ని బట్టి ప్రాజెక్టు గేట్లు ఇంకా ఎత్తి నీటిని కిందకు విడుదల చేస్తామని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తెలిపారు.

నకిలీ మద్యం కేసులో మరో ఇద్దరు

● 31కి చేరిన నిందితుల జాబితా

ములకలచెరువు, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): ములకలచెరువు నకిలీ మద్యం కేసులో ఎక్సైజ్ పోలీసులు తాజాగా మరో ఇద్దరిని నిందితులుగా చేర్చారు. తమిళనాడు రాష్ట్రం కోయంబత్తూరుకు చెందిన సెంథిల్ ఖాళీ సీసాలను తయారు చేయించి ఇక్కడికి పంపినట్లు ఎక్సైజ్ పోలీసుల విచారణలో వెల్లడైనట్లు తెలిసింది. అలాగే హైదరాబాదుకు చెందిన ప్రసాద్ సీసాల మూతలపై బ్రాండ్ పేరు వచ్చేలా ముద్రించి పంపినట్లు వెల్లడైంది. దీంతో సెంథిల్‌ను (ఏ30)గా, ప్రసాద్‌ను (ఏ31)గా చేర్చారు. దీంతో ములకలచెరువు నకిలీ మద్యం కేసులో 29గా ఉన్న నిందితుల జాబితా 31కి చేరింది. వీరిద్దరిపై ఇబ్రహీంపట్నంలోనూ కేసు నమోదైంది. కాగా నకిలీ మద్యం కేసులో అరెస్టయి జైలులో ఉన్న కేరళ రాష్ట్రం త్రిసూర్ జిల్లా కైపమంగళంకు చెందిన కె.ఎస్.జినేష్, అతడి అనుచరుడు కన్నూర్ జిల్లా పెరింతట్టకు శిబులను కస్టడీకి కోరుతూ ఎక్సైజ్ అధికారులు తంబళ్లపల్లె జూనియర్ సివిల్ కోర్టులో పిటీషన్ దాఖలు చేశారు. కాగా ములకలచెరువు నకిలీ మద్యం కేసులో అరెస్టయిన జినేష్‌ను గోవా పోలీసులు తీసుకెళ్లారు. ఈనెల 4వ తేదీన జినేష్, అతడి అనుచరుడు శిబులను ఎక్సైజ్ పోలీసులు అరెస్టు చేసి తంబళ్లపల్లె కోర్టులో హాజరు పరిచారు. జడ్జి రిమాండ్‌కు ఆదేశించడంతో మదనపల్లె సబ్‌జైలుకు తరలించారు. ఈ క్రమంలో గోవాలో ఓ కేసుకు సంబంధించి అరెస్టు పెండింగ్ ఉండడంతో గోవా పోలీసులు మదనపల్లెకు వచ్చి జినేష్‌ను తీసుకెళ్లారు. తంబళ్లపల్లె కోర్టు కస్టడీకి అనుమతి ఇస్తే గోవాకు వెళ్లి జినేష్‌ను తీసుకురావాల్సి ఉంటుందని ఎక్సైజ్ పోలీసులు చెబుతున్నారు.



మదనపల్లె జిల్లా..
కేసుల్లో ఉద్యమవీరులు

● నాటి వైసీపీ ప్రభుత్వంలో అక్రమ కేసులు
● రాజకీయ, ప్రజా సంఘాల నాయకులే బాధితులు
● 50 కేసుల్లో 200 మందికిపైగా...
● కేసుల నుంచి విముక్తికి కూటమి ప్రభుత్వానికి వేడుకోలు



మదనపల్లె జిల్లా ఆందోళనపై నమోదైన కేసుల్లో కోర్టుకు హాజరైన మాజీ ఎమ్మెల్యే దొమ్మలపాటి రమేశ్ తదితరులు (ఫైల్)

మదనపల్లె, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): గత వైసీపీ ప్రభుత్వం 2022లో జిల్లాల పునర్ వ్యవస్థీకరణలో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా 13 జిల్లాలను 26 జిల్లాకు పెంచింది. ఇందులో భాగంగా ఉమ్మడి చిత్తూరు, ఉమ్మడి కడప జిల్లాలను విభజిస్తూ రాయచోటి కేంద్రంగా రాజంపేట జిల్లాను చేస్తూ అన్నమయ్యగా ప్రకటించిన విషయం తెలిసిందే. అన్ని అర్హతలున్న మదనపల్లెను కాకుండా రాయచోటిని జిల్లా కేంద్రాన్ని చేయడాన్ని నిరసిస్తూ అప్పట్లో ఉవ్వెత్తున్న ఉద్యమాలు లేచాయి. ఒకటి కాదు.. రెండు కాదు.. ఏకంగా 300 రోజులకుపైగా ఆందోళనలు ఉధృతం చేశారు. దీనిని సహించలేని అప్పటి వైసీపీ ప్రభుత్వం ఉద్యమకారులపై పోలీసులను ఉసిగొల్పింది. మదనపల్లె, బి.కొత్తకోట ప్రాంతాల్లో జరిగిన ఉద్యమాలపై 50 కేసుల్లో 200 మందికిపైగా కేసులు నమోదయ్యాయి. వారంతా మూడేళ్లుగా కోర్టుల చుట్టూ తిరుగుతూనే ఉన్నారు.

ఉద్యమకారుల సాహసోపేత నిర్ణయంతో ఈరోజు కూటమి ప్రభుత్వం మదనపల్లెను జిల్లాగా ప్రకటించింది. అయితే జిల్లా కోసం పోరాడిన వీరులపై అప్పట్లో నమోదైన కేసుల అంశం ప్రస్తుతం తెరపైకి వస్తోంది. వైసీపీ అక్రమంగా నమోదు చేసిన కేసులను ఎత్తివేయాలని బాధితులు కూటమి ప్రభుత్వాన్ని కోరుతున్నారు. ఈ మేరకు స్థానిక ఎమ్మెల్యే ఎం.షాజహాన్‌బాషా ద్వారా సీఎం చంద్రబాబునాయుడు, డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్, మంత్రి నారా లోకేశ్‌ల దృష్టికి తీసుకెళ్లి రద్దు చేయించాలని ప్రయత్నాలు ముమ్మరం చేశారు. మదనపల్లెను కాదని, రాయచోటి కేంద్రంగా అన్నమయ్య జిల్లాను ప్రకటించడాన్ని వైసీపీ మినహా అందరూ వ్యతిరేకించారు. అన్ని రాజకీయపార్టీలు, ప్రజా, కులసంఘాలు ప్రజలతో కలిసి వివిధ రూపాల్లో ధర్నా, రాస్తారోకో, నిరసన, కార్యాలయాల ముట్టడి, మానవహారం, అఖిలపక్ష సమావేశం, రౌండ్‌టేబుల్ సమావేశం, పోస్టు కార్డు ఉద్యమం, సంతకాల సేకరణ, వంటా-వార్పు, తదితర రూపాల్లో ఆందోళన చేపట్టారు. ఎలాంటి విధ్వంసకర సంఘటనలు, ప్రభుత్వ, ప్రైవేటు ఆస్తులకు నష్టం కలగకుండా రాజ్యాంగం కల్పించిన ప్రజాస్వామ్య పద్ధతిలో అటు ఉద్యమకారులు, ఇటు ప్రజలు ప్రభుత్వానికి నిరసన తెలిపారు. ధర్నా, రాస్తారోకో చేయడం ద్వారా ప్రజలకు ఇబ్బందులు కలగడంతో పాటు ట్రాఫిక్‌కు అంతరాయం కల్పించారనే అభియోగంపై మదనపల్లె వన్‌టౌన్, టూటౌన్, బి.కొత్తకోట పోలీసులు ఉద్యమకారులపై కొరడా ఝుళిపించారు.

ఈ ఆందోళనలో జిల్లా సాధన సమితి, సాధన జేఏసీ, అఖిలపక్షం గొడుగు కింద 300 రోజులకుపైగా ఉద్యమం ఉధృతంగా నడిచింది. ఇందులో మాజీఎమ్మెల్యే దొమ్మలపాటి రమేశ్, ప్రస్తుత ఎమ్మెల్యే ఎం.షాజహాన్‌బాషా, తెలుగు యువత రాష్ట్ర అధ్యక్షుడు జి.శ్రీరామ్‌చినబాబు, జనసేన నేత గంగారపు రామ్‌దాస్‌చౌదరి, జిల్లా సాధన సమితి కన్వీనర్ పీటీఎం శివప్రసాద్, ఎస్.ఎ.మస్తాన్, పఠాన్ ఖాదర్‌ఖాన్, రాటకొండ మధుబాబు, ఆర్.జె.వెంకటేష్, వై.దొరస్వామినాయుడు, బీఎస్పీ నేత బందెల గౌతంకుమార్, సాకే కృష్ణమూర్తి, ఆర్ఎంపీ రామాంజనేయులు, ఎ.విజయమ్మ, ఎమ్మార్పీఎస్ నేత నరేంద్రబాబు, మాలమహానాడు జాతీయ నేత యమలా సుదర్శనం, సీపీఐ కృష్ణప్ప, సాంబశివ, సీపీఎం శ్రీనివాసులు, తంబళ్లపల్లె టీడీపీ నాయకురాలు ఎస్.ఎం.పర్వీన్‌తాజ్, కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ ఎం.ఎన్.చంద్రశేఖర్‌రెడ్డి, మొటుకు శివ, జి.త్యాగరాజు, వై.సురేంద్రయాదవ్‌తో సహా ఇలా 200 మందికిపైగా కేసులు నమోదయ్యాయి. ఇందులో ఒక్కో కేసు కింద అయిదుగురు నుంచి 20 మంది వరకు ఉండగా, వీరంతా ఇప్పటికీ మదనపల్లె కోర్టు చుట్టూ తిరుగుతున్నారు.

కేసులతో ఉద్యమం అణచివేతకు యత్నం

మదనపల్లె సాధన ఉద్యమం అప్పట్లో రోజురోజుకూ ఉధృతం కావడంతో పాటు వివిధ రూపాలను సంతరించుకుంది. ఉద్యమాన్ని ఎక్కడికక్కడ అణచివేతతో పాటు ఆందోళనకారులు, వారికి మద్దతిస్తున్న వారిని భయపెట్టే క్రమంలో కేసులు నమోదు చేశారు. ఈ విషయంలో తామేమీ చేయలేమని, ప్రభుత్వ నిబంధనలు పాటించాల్సిందేనని అప్పట్లో పోలీసులు బహిరంగంగా చెప్పడమే కాదు. కేసుల నుంచి తప్పించుకోవడానికి ముందస్తు అనుమతి తీసుకోవడమే మార్గమని సూచించారు.

కోర్టుకు హాజరు కావాలని సమన్ల జారీ

ఫలానా రోజున, ఫలానా చోట జరిగిన ఉద్యమంలో పాల్గొన్నారంటూ వివిధ సెక్షన్ల కింద కేసు నమోదు చేసిన పోలీసులు తర్వాత బాధితుడి నుంచి సంతకం తీసుకున్నారు. పోలీసులు వచ్చి సంతకం తీసుకునే వరకు తెలియదు తనపై కేసు నమోదైనట్లు. తర్వాత ఎఫ్ఐఆర్‌ను న్యాయస్థానానికి పంపుతుండగా తర్వాత సమన్లు జారీ చేశారు. ఇలా జిల్లా ఉద్యమంలో పాల్గొనని వారిపైనా కేసులు నమోదు చేశారు. వీటిని చూసి వారే అవాక్కయ్యారు. ఇలా ఒకచోట చేసిన ఉద్యమంలో ఆందోళన పంథాను బట్టి అయిదు నుంచి 20 మందిపై ఐపీసీ 143, 341, 353, 290, 269, 271, 506, రెడ్‌విత్ 149 తదితర సెక్షన్ల కింద కేసులు నమోదు చేశారు. నాటి వారి త్యాగం, సాహసం, ధైర్యమే చివరకు మదనపల్లె జిల్లాను సాధించిందనడంలో ఎలాంటి సందేహం లేదు. ప్రస్తుతం ఎక్కడ చూసినా ఉద్యమవీరుల గురించే చర్చిస్తున్నారు. వారిపై నమోదైన కేసుల ఎత్తివేతకు చర్యలు మొదలు పెట్టారు.

వెలవెలబోయిన టమోటా మార్కెట్

● దిత్వా తుఫాను ఎఫెక్ట్



వెలవెలబోతున్న టమోటా మార్కెట్

ములకలచెరువు, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): నిత్యం రైతులు, వ్యాపారులతో కళకళలాడే ములకలచెరువు టమోటా మార్కెట్ దిత్వా తుఫాను కారణంగా కురుస్తున్న వర్షానికి ఆదివారం వెలవెలబోయింది. ఆదివారం తెల్లవారుజాము నుంచి ఎడతెరపి లేకుండా జడివాన కురుస్తూనే ఉండడంతో తోటల్లో టమోటాలు కోయడానికి వీలు లేకుండాపోయింది. దీంతో మార్కెట్‌కు టమోటాలు అమ్మకానికి రాలేదు. ప్రతి రోజు 20 వేల బాక్సుల వరకు వచ్చే టమోటాలు తుఫానుతో కేవలం ఐదు వేలే వచ్చాయి. మార్కెట్‌కు అతి తక్కువగా టమోటాలు అమ్మకానికి రావడంతో 22 కేజీ బాక్సు రూ.800 వరకు పలికింది.

నేటి నుంచి రబీ పంటల బీమా నమోదు

● డిసెంబరు 15 వరకు గడువు



కడప రూరల్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆదేశాల మేరకు రబీ 2025-26 పంటల బీమా నమోదు కార్యక్రమాన్ని డిసెంబరు 1 నుంచి చేపట్టనున్నామని వ్యవసాయశాఖ జిల్లా అధికారి చంద్రానాయక్ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. బీమా పరిధిలోకి 8 రకాల పంటలను తీసుకొచ్చి ఏ పంటకు ఎంత ప్రీమియం చెల్లించాలో నిర్ణయించామని తెలిపారు. నువ్వుల పంటకు రూ.180, వేరుశనగ పంటకు రూ.480, పెసరకు రూ.270, జొన్నపంటకు రూ.315, మినుముకు రూ.285, వరికి రూ.630, పొద్దుతిరుగుడుకు రూ.300, బుడ్డశనగకు 480 ఒక ఎకరానికి ప్రీమియం రైతులు చెల్లించాల్సి ఉంటుంది. రైతులు వారి సమీపంలో ఉన్న కామన్ సర్వీస్ సెంటర్‌లో వారి ఆధార్, భూమి, కౌలుకార్డు, పంటవేసిన పత్రాన్ని బ్యాంక్ అకౌంట్ వివరాలు సమర్పించి ఆన్‌లైన్ ద్వారా ప్రీమియం చెల్లించి రిజిస్ట్రేషన్ చేసుకోవాల్సి ఉందని, పైన తెలిపిన పంటలకు బీమా చేసుకునేందుకు చివరి తేది డిసెంబరు 15 వరకు మాత్రమే కేటాయించినట్లు ఆ ప్రకటనలో తెలిపారు.

● వారం రోజుల పాటు బీమా వారోత్సవాలు

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆదేశాల మేరకు రబీ 2025-26 పంటల బీమా వారోత్సవాలను వారం రోజుల పాటు డిసెంబరు 1 నుంచి 7 వరకు జిల్లా వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నారు. ఈ వారోత్సవాల్లో ఆయా బ్యాంకులు, బీమా కంపెనీలు, సీఎస్‌సీలు, వ్యవసాయ ఫీల్డ్ ఫంక్షనరీలు తదితరులు ప్రచారం నిర్వహించనున్నారు. వారోత్సవాల ద్వారా 100 శాతం మంది రైతులకు పంటల బీమా పైన విస్తృతమైన అవగాహన కల్పించనున్నట్లు చంద్రానాయక్ తెలిపారు.

వైవీయూ డిగ్రీ, పీజీ పరీక్షలు వాయిదా

కడప ఎడ్యుకేషన్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): యోగివేమన విశ్వవిద్యాలయం పరిధిలో సోమవారం జరగాల్సిన డిగ్రీ, పీజీ పరీక్షలు వాయిదా వేసినట్లు వైవీయూ పరీక్ష నియంత్రణ అధికారి ఆచార్య కేఎస్‌వీ కృష్ణారావు వెల్లడించారు. విశ్వవిద్యాలయ అధికారుల ఆదేశాల మేరకు దిత్వా తుఫాన్ కారణంగా వాయిదా వేశామని, పరీక్షల తేదీని ఎప్పుడు నిర్వహించేది త్వరలో తెలియజేస్తామన్నారు. విద్యార్థులు, కళాశాలల ప్రిన్సిపల్‌లు ఈ విషయాన్ని గమనించాలన్నారు.

నేడు ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలకు సెలవు

రాయచోటిటౌన్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): దిత్వా తుఫాను కారణంగా కలెక్టర్ ఆదేశాల మేరకు సోమవారం జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు యాజమాన్యాల్లోని పాఠశాలలకు సెలవు ప్రకటించినట్లు డీఈవో సుబ్రమణ్యం ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. విద్యార్థులు కుంటలు, కాలువలు, చెరువులు, పాడుబడిన గోడల వద్దకు వెళ్లకుండా తల్లిదండ్రులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కలెక్టర్ ఆదేశాలను ఎవరైనా ఉల్లంఘించి పాఠశాలలు తెరిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

నడిరోడ్డులో కారు దగ్ధం



నడిరోడ్డులో దగ్ధమౌతున్న కారు

మదనపల్లె అర్బన్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): మదనపల్లె పట్టణం కదిరి రోడ్డులోని రాయలసీమ స్కూల్ వద్ద వెళుతున్న కారులో పెట్రోల్ ట్యాంకు లీక్ కావడంతో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. పట్టణంలోని కురవంకకు చెందిన ఎన్ఆర్‌జీఎస్‌లో ఏఈగా పనిచేస్తున్న రఘునాథ్, ఆయన చెల్లెలు భారతితో కలిసి కారులో బైపాస్ రోడ్డులోని యోగా సెంటర్‌కు వెళుతుండగా కారులో మంటలు చెలరేగాయి. దీంతో అప్రమత్తమైన వారు వెంటనే కిందకు దిగి పరుగులు తీశారు. మదనపల్లె అగ్నిమాపక అధికారి శివన్నతో పాటు సిబ్బంది వచ్చి మంటలను ఆర్పేశారు. అప్పటికే కారు పూర్తిగా మంటల్లో కాలి బూడిదైంది.

డిసెంబరు 3వ వారంలో చంద్రబాబు రాక

● పులివెందుల టీడీపీ ఇన్‌చార్జి బీటెక్ రవి



విలేకరులతో మాట్లాడుతున్న బీటెక్ రవి

వేంపల్లె, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబునాయుడు డిసెంబరు 3వ వారంలో పులివెందులకు రానున్నారని పులివెందుల టీడీపీ ఇన్‌చార్జి బీటెక్ రవి తెలిపారు. ఆదివారం వేంపల్లెలో పలు కార్యక్రమాలకు హాజరైన ఆయన సమావేశంలోనూ, విలేకరులతో మాట్లాడుతూ పులివెందుల నియోజకవర్గంలో అన్ని సమస్యలను పరిష్కరించేందుకు కార్యచరణ రూపొందిస్తున్నామన్నారు. పులివెందులకు రానున్న చంద్రబాబు దృష్టికి తాగు, సాగునీటి సమస్య తీసుకెళ్తామని, జీఎన్ఎస్ఎస్ కాల్వ నుంచి చివరి ప్రాంతమైన చక్రాయపేట, వేంపల్లెకు నీటిని అందించేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని కోరనున్నామన్నారు. గత వైసీపీ ప్రభుత్వం, వైఎస్ ప్రభుత్వం పక్కనపెట్టిన సూక్ష్మనీటి సేద్యం పథకాన్ని అమలు చేయించేందుకు రూ.2500 కోట్లు అవసరమని, సీఎంతో ఆ బృహత్తర పథకాన్ని చేపట్టేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఈసారి జరగబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో సర్పంచు నుంచి ఎంపీటీసీ, జడ్పీటీసీ పదవులన్నీ వందశాతం టీడీపీ కార్యకర్తలకు వచ్చేలా చేయడమే లక్ష్యమన్నారు.

కోడూరులో ఎడతెరపిలేని వర్షం

● అలుగులు పారుతున్న చెరువులు
● లోతట్టు ప్రాంతాలను పరిశీలించిన అధికారులు



గుంజన నదిలో వరద నీరు



రైల్వేకోడూరు ప్రధాన దారిలో వర్షంతో ఇబ్బంది పడుతున్న ప్రజలు

రైల్వేకోడూరు, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి) : దిత్వా తుఫాను ప్రభావంతో రైల్వేకోడూరు నియోజకవర్గంలో శనివారం రాత్రి నుంచి ఎడతెరపి లేకుండా వర్షం కురుస్తూనే ఉంది. దీంతో లోతట్టు ప్రాంతాల్లో నివశిస్తున్న ప్రజలు భయాందోళన చెందుతున్నారు. మండలంలోని శెట్టిగుంట చెరువు గత వారం క్రితం కురిసిన వర్షాలకే అలుగు పారుతోంది. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు అది ఇంకా ఉధృతంగా ప్రవహిస్తోంది. గుంజన, ముష్టేరు, గుండాలేరు, మేకలగుంతెరు తదితర నదులు, చెరువులు, గుంతల వద్దకు ప్రజలు ఎవరూ వెళ్లరాదని అధికారులు హెచ్చరికలు జారీ చేశారు. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు రెడ్డిపల్లె తాత్కాలిక రోడ్డు సగభాగం కొట్టుకుపోయింది. లోతట్టు ప్రాంతాల ప్రజలను సురక్షితమైన ప్రాంతాలకు తరలించడానికి అధికారులు అన్ని ఏర్పాట్లు సిద్ధం చేశారు. రైల్వేకోడూరు ప్రాంతంలోని రైల్వే స్టేషన్ రోడ్డు, ప్రధాన రహదారి, రంగనాయకులపేట, కొత్తబజారు తదితర వీధి రోడ్లు జలమయమయ్యాయి. పలు దుకాణాల్లోకి వర్షపునీరు చేరడంతో వ్యాపారులు పలు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ప్రధాన రహదారిలో భారీగా నీరు ఉండడంతో పాదచారులు తీవ్ర ఇక్కట్లకు గురయ్యారు. రైల్వేకోడూరు తహసీల్దారు కోనేటి అమర్‌నాథ్, ఎంపీడీవో నాగిరెడ్డి, సీఐ చంద్రశేఖర్, ఎస్ఐ పీఎల్ ప్రసాద్‌రెడ్డిలు తమ సిబ్బందితో లోతట్టు ప్రాంతాలను పరిశీలించి ప్రజలను అప్రమత్తం చేశారు.

పోరు ఫలితమే మదనపల్లె జిల్లా

● చంద్రబాబు ఇచ్చిన మాట నిలబెట్టుకున్నారు
● 70 మంది ఉద్యమకారులకు సన్మానం




సంఘీభావం తెలుపుతున్న మదనపల్లె జిల్లా సాధన సమితి సభ్యులు, ఎమ్మెల్యే షాజహాన్‌బాషా, తదితరులు

మదనపల్లె టౌన్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): మదనపల్లె జిల్లా సాధన సమితి ఆధ్వర్యంలో అన్ని రంగాల ఉద్యమకారులు నిర్వహించిన పోరు ఫలితమే మదనపల్లె జిల్లా ఏర్పాటు అని ఎమ్మెల్యే షాజహాన్‌బాషా తెలిపారు. ఆదివారం స్థానిక శ్రీకృష్ణ ఫంక్షన్ హాలులో మదనపల్లె జిల్లా సాధన సమితి పోరాటంలో పాల్గొన్న 70 మంది ఉద్యమకారులను ఎమ్మెల్యే ఆధ్వర్యంలో సన్మానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ 1911 సంవత్సరంలోనే మద్రాసు రాష్ట్రంలో మదనపల్లె జిల్లా కావాల్సి ఉండేదని, తిరిగి 114 ఏళ్ల తరువాత సీఎం చంద్రబాబు ఇక్కడి ప్రజల చిరకాల కోరిక అయిన మదనపల్లె జిల్లాను ఏర్పాటు చేశారన్నారు. ఎన్నికలకు ముందు ఇచ్చిన మాట ప్రకారం చంద్రబాబు మదనపల్లెను కొత్త జిల్లాగా ప్రకటించారన్నారు. వైసీపీ ప్రభుత్వం జిల్లాల విభజన చేయకముందే మదనపల్లె జిల్లా సాధన సమితి ఏర్పడి వందలాది మంది జిల్లా సాధన కోసం నాలుగు నియోజకవర్గాల్లో ఉద్యమాలు నిర్వహించారన్నారు. ఇందులో భాగంగా అనేక పోలీసు కేసులు వీరిపై నమోదయ్యాయన్నారు. వీరందరి పోరాట ఫలితమే నేడు మదనపల్లె జిల్లా ఏర్పాటుకు పునాది పడిందన్నారు. అనంతరం ఉద్యమకారులందరినీ సన్మానించారు. కార్యక్రమంలో పీటీఎం శివప్రసాద్, యమలా సుదర్శనం, ఎమ్మార్పీఎస్ నరేంద్ర, రాటకొండ గురుప్రసాద్, ఎన్.సేతు, నాదెళ్ల విద్యాసాగర్, మునిరత్నం, జంగాల శివరామ్, నాగార్జున, వెంకటరెడ్డి, శశిధర్ తదితరులు పాల్గొన్నారు.

గండికోట ప్రాజెక్టులో 26.3 టీఎంసీల నీటిమట్టం

కొండాపురం, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): గండికోట ప్రాజెక్టులో ఆదివారం 26.324 టీఎంసీల నీటిమట్టం ఉన్నట్లు ఈఈ ఉమామాహేశ్వర్లు తెలిపారు. ప్రస్తుతం తాగునీటి అవసరాల దృష్ట్యా 20 క్యూసెక్కుల నీరు మాత్రమే బయటికి వదులుతున్నామన్నారు. అదేవిధంగా ప్రస్తుతం ప్రాజెక్టులోకి వచ్చే ఇన్‌ఫ్లో లేదని ఈఈ తెలిపారు. కాగా గండికోట ప్రాజెక్టు పూర్తి నీటి సామర్థ్యం 26.85 టీఎంసీలు.

గండికోటలో రాక్‌క్లైంబింగ్



జమ్మలమడుగు, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): జమ్మలమడుగు మండలంలోని పర్యాటక ప్రాంతమైన గండికోటలో ఆంధ్రప్రదేశ్, తెలంగాణాకు చెందిన విద్యార్థులకు రాక్ క్లైంబింగ్‌పై శిక్షణ ఇచ్చారు. అడ్వెంచర్ స్పోర్ట్స్ అకాడమీ గండికోట ఆధ్వర్యంలో ఈ శిక్షణ ఆదివారం మూడవ రోజుకు చేరుకుంది. వివిధ పాఠశాలలు, కళాశాలలకు చెందిన సుమారు వంద మందికిపైగా విద్యార్థులు అడ్వెంచర్ రంగంలో అవసరమైన నైపుణ్యాలను నేర్చుకున్నారు. దీంతో యువతలో శారీరక దృఢత్వం, నైపుణ్యం కలిగి ఉంటారని నిర్వాహకులు తెలిపారు.

సదరం సర్టిఫికెట్లలో తప్పులను సవరించాలి



మంత్రి సత్యకుమార్‌యాదవ్‌కు వినతిపత్రం అందిస్తున్న దివ్యాంగులు

ప్రొద్దుటూరు టౌన్, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): సదరం సర్టిఫికెట్లలో తప్పులను సవరించడానికి చర్యలు తీసుకోవాలని వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్‌కు ఆల్‌ఆఫ్‌యూ దివ్యాంగుల సేవా సొసైటీ ఆధ్వర్యంలో దివ్యాంగులు రాయల్‌కౌంటీలో ఆదివారం వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా సంఘం రాష్ట్ర కన్వీనర్ అఫ్జల్ మాట్లాడుతూ దివ్యాంగులకు కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ విధానంలో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించాలని కోరారు. సదరం సర్టిఫికెట్ రీవెరిఫికేషన్‌లో అనేక తప్పులు దొర్లాయని, అలాగే పోలియోతో రెండుకాళ్లు చచ్చుబడిన దివ్యాంగులకు పర్సంటేజీని తగ్గించారన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ డీసీహెచ్‌తో మాట్లాడి తగిన చర్యలు తీసుకుంటామని, దివ్యాంగులకు ఏవైనా సమస్యలుంటే తమ దృష్టికి తెస్తే పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు.

అప్రమత్తంగా ఉండాలి

పెద్దమండ్యం, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): సైబర్ మోసగాళ్లతో ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా వుండాలని కలిచెర్ల జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ అమరేంద్ర కుమార్, ఎన్‌ఎస్‌ఎస్ పీవో వెంకటనరసయ్య తెలిపారు. ఆదివారం ఎన్‌వోపల్లిలో ఎన్‌ఎస్‌ఎస్ క్యాంప్‌లో భాగంగా మత్తు పదార్థాలు, సైబర్ మోసాలు, పరిసరాల పరిశుభ్రతపై ఆ గ్రామ ప్రజలకు అవగాహన కల్పించి ర్యాలీ నిర్వహించారు. ఎన్‌వోపల్లి పాఠశాల అవరణంలో మొక్కలు నాటడానికి గుంతలు తవ్వారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ఆరోగ్య సలహాలు అందించారు. కార్యక్రమంలో సర్పంచ్ పద్మావతి, ఎన్‌ఎస్‌ఎస్ విద్యార్థులు, అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

పాలకుల నిర్లక్ష్యంతోనే సీమ వెనుకబాటు

- శిలాఫలకాలు, హామీలకే పరిమితమైన కడప ఉక్కుపరిశ్రమ
- మధ్యలోనే ఆగిన కడప-బెంగళూరు రైల్వేలైన్
- ఉద్యమానికి సన్నద్ధం కాకపోతే అధోగతే
- రౌండ్‌టేబుల్ సమావేశంలో పలు పార్టీలు, ప్రజాసంఘాల నేతలు



సంఘీభావం తెలుపుతున్న పలు పార్టీల, ప్రజాసంఘాల నేతలు

కడప మారుతీనగర్, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): దేశానికి స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుండి మన రాష్ట్రానికి ముఖ్యమంత్రులుగా రాయలసీమకు చెందిన నాయకులు పాలన చేసినప్పటికీ సీమ వెనుకబాటుకు గురైందని పలు పార్టీల, ప్రజా సంఘాల నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు. రెవల్యూషనరీ స్టూడెంట్స్ ఫెడరేషన్ (ఆర్‌ఎస్‌ఎఫ్) రాయలసీమ ప్రాంతీయ కమిటీ సారథ్యంలో ఆ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు డీఎం ఓబులేసు యాదవ్ ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో కడప ఉక్కు పరిశ్రమ, ప్రభుత్వ మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణ, కడప-బెంగుళూరు రైల్వేలైన్ అంశాలపై ప్రత్యేక రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పలు పార్టీల నాయకులు అవ్వారు మల్లికార్జున (జేసీఐ), సత్తార్ కె.లక్ష్మయ్య(కాంగ్రెస్), రామ్మోహన్(సీపీఎం), వెంకటశివ(సీపీఐ), సంగటి మనోహర్(ఎంఆర్‌పీ), సగిలి గుర్రప్ప(బీఎస్‌పీ), ప్రతాప్‌రెడ్డి(జనతాదళ్), సలావుద్దీన్(ముస్లిం సమైక్యవేదిక), ప్రసాద్ (ఆర్‌సీపీ), శ్రీనివాసులు(ఆమ్‌ఆద్మీపార్టీ), దేవర శ్రీకృష్ణ(లోక్‌సత్తా), అంకన్న(పీడీఎస్‌యూ) తదితరులు మాట్లాడారు. కడప ఉక్కు పరిశ్రమ నిర్మాణం కోసం దశాబ్దానికి పైగా ఈ ప్రాంత ప్రజలు, ప్రజాసంఘాలు ఉద్యమాలు చేస్తున్నారని, ప్రభుత్వాలు హామీలిస్తూ శంకుస్థాపనలు చేస్తున్నారే తప్ప ఉక్కు పరిశ్రమ నిర్మాణంలో ముందడుగు పడలేదన్నారు. సంవత్సరాలు గడుస్తున్నకొద్దీ ఉత్పత్తి సామర్థ్యాన్ని కూడా తగ్గిస్తున్నాయన్నారు. కర్నూల్, కడప, అనంతపురం జిల్లాలకు మధ్యలో ఉన్న జమ్మలమడుగు వద్ద నిర్మించ తలపెట్టిన ఉక్కుపరిశ్రమ పూర్తయితేనే రాయలసీమ పారిశ్రామిక అభివృద్ధి సాధ్యమన్నారు. ఈ ప్రాంతంలో ఇంజనీరింగ్, డిగ్రీ, ఎంబీఏ, ఎంసీఏ, పాలిటెక్నిక్, ఐటీఐ పూర్తిచేసుకున్న విద్యార్థులు ఉద్యోగాల కోసం హైదరాబాద్, బెంగుళూరు, చెన్నై, గల్ఫ్, తదితర ప్రాంతాలకు వలస వెళుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కడప-బెంగుళూరు రైల్వేలైన్‌కు పది సంవత్సరాల క్రితమే నిధుల కేటాయింపు, భూసేకరణ చేశాయని, ఇందుకు ఆనాటి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆమోదం కూడా తెలిపాయన్నారు. ఆ మేరకు కడప, రాయచోటి, మదనపల్లె మీదుగా బెంగుళూరుకు అన్ని రకాలుగా ప్రణాళికలు కూడా పూర్తయ్యాయన్నారు. కానీ సహజంగా సీమ ప్రాంతంపై ఉన్న పాలకుల నిర్లక్ష్యం కారణంగా అది కూడా మధ్యలోనే ఆగిపోయిందన్నారు. కేవలం కడప నుండి పెండ్లిమర్రి వరకు మాత్రమే రైల్వేట్రాక్ పూర్తయి కడప నుండి నంద్యాల వరకు డెమో రైలు వస్తోందన్నారు. ఏదిఏమైనా కడప-బెంగుళూరు రైల్వే లైన్ పూర్తయితే ఈ ప్రాంతం ఆర్థిక, పారిశ్రామిక అభివృద్ధికి ఆస్కారం ఉంటుందన్నారు. కాగా కూటమి ప్రభుత్వం మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణకు పూనుకోవడం వలన ఈ ప్రాంత పేద, మధ్యతరగతి విద్యార్థులకు వైద్య విద్య అందని ద్రాక్షలాగా మారుతుందన్నారు. పైపెచ్చు వైద్యం కూడా పేదలకు కష్టం అవుతుందన్నారు. కూటమి ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చే విధంగా పలు పార్టీలు, ప్రజా సంఘాలతో ఉద్యమానికి శ్రీకారం చుడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు సీఆర్‌వీ ప్రసాద్, మహిళానాయకురాలు భాగ్యలక్ష్మీ (సీపీఐ), బాబు (ఎన్‌ఎస్‌యూఐ), పలువురు నాయకులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి హ్యాండ్‌బాల్ పోటీల్లో
చిత్తూరు, కృష్ణా జిల్లాల విజయం



విజేత జట్లతో నిర్వాహకులు, అధికారులు

కలికిరి, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): కలికిరిలో మూడు రోజులపాటు జరిగిన రాష్ట్ర స్థాయి హ్యాండ్‌బాల్ పోటీల్లో అండర్-14 బాలుర విభాగంలో చిత్తూరు, బాలికల విభాగంలో కృష్ణా జిల్లాల జట్టు విజేతలుగా నిలిచాయి. ఆదివారం జరిగిన ఫైనల్స్‌లో విశాఖపట్నం బాలుర జట్టుతో తలపడిన చిత్తూరు జట్టు 9-4 గోల్స్ తేడాతో భారీ విజయం చేజిక్కించుకుంది. ప్రకాశం జిల్లా జట్టుతో తలపడిన కృష్ణా బాలికల జట్టు 6-3 స్కోర్‌తో ఘన విజయం సాధించింది. ముఖ్య అతిథిగా హాజరైన కలికిరి పంచాయతీ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు రెడ్డివారి యోగేష్ రెడ్డి విజేతలకు బహుమతులు అందజేశారు. అదే విధంగా రాష్ట్రంలోని 13ఉమ్మడి జిల్లాల నుంచి పోటీల్లో పాల్గొన్న ఉత్తమ ప్రతిభ కనబరిచిన 16 క్రీడాకారులను జాతీయ పోటీలకు ఎంపిక చేసినట్లు నిర్వాహకులు ప్రకటించారు. మూడు రోజులపాటు జరిగిన పోటీలకు హాజరైన దాదాపు 600 మంది క్రీడాకారులు, కోచ్‌లు, మేనేజర్లు, పీడీలకు వసతి, భోజన సౌకర్యం కల్పించిన యోగేష్ రెడ్డిని అభినందించారు. కార్యక్రమంలో ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి ఝాన్సీ, ఎన్టీఆర్ జిల్లా కార్యదర్శి శివప్రసాద్, క్రీడా పోటీల రాష్ట్ర పరిశీలకుడు వెంకటేశ్వరరావు, కలికిరి పీడీ రెడ్డివరప్రసాద్, పరిసర ఉన్నత పాఠశాలల హెచ్‌ఎంలు, పీడీలు, క్రీడాకారులు పాల్గొన్నారు.

భారతీయుల ఐక్యత కోసమే హిందూ సమ్మేళన సభ

- అచలానంద ఆశ్రమం పీఠాధిపతి విరజానందస్వామి



హిందూ సమ్మేళనంలో మాట్లాడుతున్న పీఠాధిపతి విరజానందస్వామి

బ్రహ్మంగారిమఠం, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): భారతీయులంతా ఐకమత్యంగా ఉండాలన్నదే హిందూ సమ్మేళన సభ లక్ష్యమని అచలానంద ఆశ్రమం పీఠాధిపతి విరజానందస్వామి తెలిపారు. ఆదివారం బ్రహ్మంగారిమఠంలో రాష్ట్ర స్వయం సేవక్ సంఘ్ మండల అధ్యక్షుడు అయ్యప్ప సురేశ్ ఆధ్వర్యంలో హిందూ సమ్మేళన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా పీఠాధిపతి విరజానందస్వామి, జగన్మాత ఈశ్వరీదేవి మఠం మఠాధిపతి వీర శివకుమారస్వామి, రాష్ట్ర స్వయం సేవక్ సంఘం నాయకులు సుధాకర్, రమాదేవి హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ హిందువులంతా ఒక తాటిపైకి వచ్చి కలిసి మెలిసి ఉండడానికే హిందూ సమ్మేళన కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందన్నారు. చిన్నారులు నిర్వహించిన నృత్యగీతాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమానికి చుట్టు పక్కల గ్రామాల ప్రజలు, రాజకీయనేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

6న మల్లయ్యకొండ పనులకు బహిరంగ వేలం

- 3వ తేదీన హుండీ లెక్కింపు

తంబళ్లపల్లె, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన మల్లయ్యకొండ మల్లికార్జున స్వామి దేవస్థానంలో వివిధ పనులకు ఏడాది పాటు హక్కులను పొందడానికి ఈనెల 6న బహిరంగ వేలం నిర్వహించనున్నట్లు ఆలయ ఈవో మునిరాజ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. తలనీలాలు సేకరించుకునే హక్కు(ధరావత్తు రూ.1లక్ష), వాహనాల టోల్ గేట్ వసూలు హక్కు(ధరావత్తు రూ.1లక్ష), గౌరమ్మ ఆలయం, ఏనుగు మల్లమ్మ ఆలయం వద్ద పూజా సామగ్రి విక్రయించుకునేందుకు (ధరావత్తు రూ.50వేలు), వీరన్న గెవి వద్ద(ధరావత్తు రూ.10 వేలు), దేవస్థానం వద్ద కొబ్బరి చిప్పలు సేకరించుకునేందుకు, కొండ పైన దుకాణాలకు గేటు వసూలు హక్కుకు (ధరావత్తు రూ.50వేలు), చెప్పులు పోగు చేసుకునే హక్కు(2026 ఫిబ్రవరి 14, 15, 16 మూడు రోజులు మాత్రమే, ధరావత్తు రూ.10వేలు)లకు వేలం నిర్వహించనున్నట్లు తెలిపారు. గతంలో హక్కు దక్కించుకుని దేవస్థానానికి బకాయి ఉన్న వారు వేలంలో పాల్గొనడానికి అనర్హులన్నారు. వేలంలో పాల్గొనదలచిన వారు ఆధార్‌కార్డు జిరాక్స్ కాపీ, సూచించిన ధరావత్తు చెల్లించి పాల్గొనాలని సూచించారు. ఈనెల 3వ తేదీన బుధవారం మల్లయ్యకొండ దేవస్థానంలో భక్తులు సమర్పించిన హుండీ కానుకల లెక్కింపు కార్యక్రమం ఉంటుందని భక్తులు, కూటమి నేతలు హాజరు కావాలని ఈవో కోరారు.

చట్టపరమైన చర్యలు తీసుకుంటాం : సీఐ

అట్లూరు, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): స్థల వివాదం కేసులో ఇరువర్గాలపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని బద్వేలు రూరల్ సీఐ కృష్ణయ్య వెల్లడించారు. నవంబరు 24న స్థల వివాదంపై రెడ్డిపల్లె గ్రామానికి చెందిన ఆంజనేయులు, అయ్యప్పస్వామి ఆలయనిర్వాహకుడు మాలే నరసింహారెడ్డి ఇరువురు ఘర్షణపడ్డారు. ఇద్దరికీ గాయాలు కావడంతో అట్లూరు ఎస్‌ఐ రామక్రిష్ణ ఇరువురిపై కేసులు నమోదు చేశారు. కానీ అయ్యప్ప భక్తుడైన నరసింహారెడ్డికి తలకు దెబ్బతగలడంతో ఆయనకు మద్దతుగా ఆంజనేయులుపై చర్యలు తీసుకోవాలని ఆదివారం అట్లూరు క్రాస్ రోడ్డుపై అయ్యప్ప స్వాములు బైఠాయించి ధర్నా నిర్వహించారు. కార్యక్రమంలో గోపవరం ఎస్‌ఐ శ్రీకాంత్, డిప్యూటీ తహసీల్దారు శిరీషా, ఆర్‌ఐ రమణ, అయ్యప్ప భక్తులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేయాలి

కలికిరి, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీని జిల్లాలో బలోపేతం చేయడానికి నేతలు కృషి చేయాలని ఏఐసీసీ, ఏపీసీసీ పరిశీలకులు సూచించారు. గ్రామ స్థాయి నుంచి పార్టీ బలోపేతానికి సంస్థాగతంగా చర్యలు తీసుకోవాలని కోరారు. పీలేరు నియోజకవర్గంలో సంస్థాగత నిర్మాణ కార్యక్రమానికి నిర్వహించిన సమావేశంలో పాల్గొన్న ఏఐసీసీ పరిశీలకుడు కె.మహేంద్రన్, ఏపీసీసీ పరిశీలకుడు జంగా గౌతమ్, టీసీసీ రాష్ట్ర కార్యదర్శి రాకేష్ పార్టీని పునర్నిర్మాణానికి తీసుకోవలసిన చర్యల గురించి స్పష్టమైన మార్గదర్శకాలు జారీ చేశారు. నియోజకవర్గ ఇన్‌చార్జి సోమశేఖర్ రెడ్డి ఇప్పటికే పార్టీని సంస్థాగతంగా పటిష్టపరచడానికి తీసుకున్న చర్యలు గురించి వివరించారు. జిల్లా కాంగ్రెస్ అధ్యక్ష పదవికి దరఖాస్తు చేసుకోవాలని పరిశీలకులు సూచించారు. జిల్లా అధ్యక్షుడు గాజుల భాస్కర్ మాట్లాడుతూ జిల్లాలో పార్టీని పునర్నిర్మించాల్సి వుందన్నారు. మొదట కాంగ్రెస్ నేతలు నాలుగు రోడ్ల కూడలిలోని గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

ప్రజలకు పూర్తిగా ఉచిత వైద్యం

మదనపల్లె అర్బన్, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): పీపీపీ విధానంలో మెడికల్ కాలేజీలు అనుబంధ ఆస్పత్రులు పూర్తిగా ప్రభుత్వాధీనంలో ఉంటాయని, దీంతో ప్రజలకు పూర్తిగా ఉచిత వైద్యం అందుతుందని బీజేపీ జాతీయ నేత చల్లపల్లె నరసింహారెడ్డి అన్నారు. ఆదివారం సొసైటీ కాలనీలోని తన స్వగృహంలో నరసింహారెడ్డి మీడియాతో మాట్లాడుతూ ఆరోగ్య రంగంలో పూర్తిగా విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చి మదనపల్లె వైద్య కళాశాల మీద ప్రత్యేక దృష్టి నిలిపారన్నారు. కార్యక్రమంలో బీజేపీ నేతలు మెడికల్ ప్రాక్టీషనర్ రాష్ట్ర ఉపాధ్యక్షులు డాక్టర్ అజ్మతుల్లాఖాన్, విజయ భారతి అధినేత డాక్టర్ ఎన్. సేతు, బర్నేపల్లె రవికుమార్, ఆకుల కృష్ణమూర్తి పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం

పీలేరు రూరల్, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించడంలో ప్రభుత్వం నిర్లక్ష్య ధోరణి అవలంబిస్తోందని యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు హరిప్రసాద్, జాబీర్ ఆరోపించారు. ఆదివారం పీలేరులో యూటీఎఫ్ కార్యాలయాన్ని ప్రారంభించిన వారు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాకముందు ఉద్యోగ, ఉపాధ్యాయులకు అనేక హామీలు ఇచ్చిందని, వాటిని నమ్మి ప్రభుత్వ ఏర్పాటుకు ఎంతో శ్రమించామని, తీరా అధికారంలోకి వచ్చాక హామీలు నెరవేర్చడంలో తీవ్ర నిర్లక్ష్య ధోరణి ప్రదర్శిస్తోందన్నారు. వైసీపీ ప్రభుత్వం తమపై కక్షపూరితంగా వ్యవహరించిందని, ఉద్యోగులకు చెల్లించాల్సిన ఆర్థిక బకాయిలు చెల్లించకుండా తీవ్ర వేధింపులకు గురిచేసిందన్నారు. రివర్స్ పీఆర్‌సీతో ఉద్యోగులను జగన్ ప్రభుత్వం దగాచేసిందని విమర్శించారు. ఉపాధ్యాయులకు బోధనేతర పనుల నుంచి విముక్తి కల్పించాలని డిమాండ్ చేశారు. 25 ఏళ్లకు పైగా బోధనలో అనుభవం ఉన్న వారిని ఇప్పుడు టెట్ రాయమనడం సహేతుకం కాదన్నారు. సమావేశంలో రాధాక్రిష్ణ, చంద్రశేఖర్, అక్రంబాషా, భాస్కర్‌రెడ్డి, ఆదినారాయణ, విజయకుమార్, తదితరులు పాల్గొన్నారు.

ప్రజాస్వామ్యం అపహాస్యంపై
వైసీపీ నాయకులు మాట్లాడడమా..!

- ఈసారి అన్ని పదవులూ టీడీపీకే
- మైనార్టీలు చేరడం శుభసూచకం
- పులివెందుల టీడీపీ ఇన్‌చార్జి బీటెక్ రవి



బీటెక్ రవి సమక్షంలో వైసీపీ నుంచి టీడీపీలో చేరిన మైనార్టీ నాయకులు

వేంపల్లె, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): ప్రజాస్వామ్యం అపహాస్యం అవుతోందంటూ స్థానిక వైసీపీ నేత మాట్లాడడం విడ్డూరంగా ఉందని, వైఎస్ కుటుంబం గత ఎన్నికల్లో రిగ్గింగ్‌కు, అరాచకానికి పాల్పడి, టీడీపీ కార్యకర్తలపై దాడి చేసింది గుర్తులేదా అంటూ పులివెందుల టీడీపీ ఇన్‌చార్జి బీటెక్ రవి అన్నారు. సార్వత్రిక ఎన్నికల్లో రిగ్గింగ్ చేయాలని చూడడం, స్థానిక ఎన్నికల్లో అక్రమంగా ఏకగ్రీవాలు చేసుకోవడం మరచిపోయారా అని సూటిగా ప్రశ్నించారు. అన్ని పదవులు ఎప్పుడూ మీకే కావాలా, ముప్పైనలభై ఏళ్లుగా ఎదురుచూస్తున్నాం, సర్పంచు నుంచి జడ్పీటీసీ, ఎంపీటీసీ అన్ని పదవులు టీడీపీ కార్యకర్తలకు దక్కించుకోవడమే ఏకైక లక్ష్యమని, అందుకోసం దేనికైనా సిద్ధంగా ఉన్నామని బీటెక్ రవి ప్రకటించారు. వేంపల్లె పట్టణంలో వైసీపీ మైనార్టీ నాయకులు మొండోడు గౌస్, ఇస్మాయిల్ ఆధ్వర్యంలో ఆదివారం పెద్దఎత్తున ముస్లిం మైనార్టీలు టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. పులివెందుల టీడీపీ ఇన్‌చార్జి బీటెక్ రవి, మండల పరిశీలకుడు రఘునాథరెడ్డి కండువా వేసి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో బీటెక్ రవి మాట్లాడుతూ టీడీపీకి పూర్వ వైభవం వస్తుందని, పెద్దఎత్తున మైనార్టీలు పార్టీలోకి చేరడమే నిదర్శనమన్నారు. స్థానిక వైసీపీ నాయకులు జగన్ మెప్పు కోసం టీడీపీపై నిందలు వేస్తున్నారని విమర్శించారు. కార్యక్రమంలో టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు పార్థసారధిరెడ్డి, టీడీపీ మండల అధ్యక్షుడు మునిరెడ్డి, మైనార్టీ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ షబ్బీర్, వక్ఫ్‌బోర్డు మాజీ డైరెక్టర్ దర్బార్, మైనార్టీ కన్వీనర్ తెలంగాణ వల్లి, మండల కార్యదర్శి తక్కెళ్ల షరీఫ్, యాసిన్, మహబూబ్ షరీఫ్, వేంపల్లె పట్టణ అధ్యక్షుడు నామా వేమకుమార్, పులివెందుల వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ అమర్‌నాథ్‌యాదవ్, సింగిల్ విండో చైర్మన్ రామాంజనేయ రెడ్డి, జిల్లా మహిళా ఉపాధ్యక్షురాలు శ్రీదేవి, పుష్పనాథ్‌రెడ్డి, వీరభద్ర తదితరులు పాల్గొన్నారు.

పశువుల తరలింపుపై కేసు నమోదు

- 82 పశువుల పట్టివేత

ఎర్రగుంట్ల, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): రెండు కంటైనర్లలో అక్రమంగా 82 పశువులను తరలిస్తున్న వారిపై కేసు నమోదు చేసినట్లు అర్బన్ సీఐ విశ్వనాథరెడ్డి తెలిపారు. శనివారం రాత్రి కేఏ 43 ఏ 1980 నెంబరు గల కంటైనర్‌లో శాంతారాం ఆర్ముగం, అబ్దుల్ అజీజ్ 41 పశువులను పెబ్బేరు నుంచి పుంగనూరుకు, మరో 41 పశువులను డబ్ల్యూబీ23 డీ4340 కంటైనర్‌లో ఆలీ అనే వ్యక్తి మైదుకూరు నుంచి అనంతపురానికి తీసుకెళుతున్నారు. ఇందులో 34ఎద్దులు, 38గేదెలు, 10దున్నపోతులున్నాయని, ఆవులు లేవని సీఐ తెలిపారు. శనివారం రాత్రి ఎస్‌ఐ నాగమురళి పశువైద్యుల ఆధ్వర్యంలో వీటిని బద్వేలులో పరిశీలించి వాటి సంరక్షణార్థం మైదుకూరులో మేత ఉన్న చోట ఉంచారు. ప్రివెన్స్ ఆఫ్ క్రూయాలిటి టు అనిమల్స్ యాక్టు ప్రకారం కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు. ఈ విషయాన్ని కోర్టు దృష్టికి తీసుకెళ్లి, కోర్టు ఆదేశానుసారం చర్యలు తీసుకుంటామని ఆయన వివరించారు.

చీరకు మంట అంటుకుని వృద్ధురాలి మృతి

పోరుమామిళ్ల, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): గ్యాస్ స్టవ్‌పై వంట చేస్తుండగా ప్రమాదవశాత్తు చీరకు మంటలు అంటుకోవడంతో ఒళ్లంతా కాలిన గాయాలతో చికిత్స పొందుతూ కోనేటి నాగమ్మ (72) మృతి చెందిందని ఎస్‌ఐ కొండారెడ్డి తెలిపారు. మండలంలోని దాసరిపల్లె గ్రామానికి చెందిన కోనేటి నాగమ్మ శనివారం మధ్యాహ్నం 3గంటల సమయంలో గ్యాస్ స్టవ్‌పై వంట చేస్తుండగా ప్రమాదవశాత్తు మంటలు చీరకు అంటుకుని వళ్లంతా గాయాలయ్యాయి. వెంటనే కుటుంబ సభ్యులు ఆమెను పోరుమామిళ్ల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా మెరుగైన వైద్యం కోసం కడపకు తీసుకెళ్లారు. చికిత్స పొందుతూ ఆమె ఆదివారం ఉదయం మృతి చెందిందని తెలిపారు. మృతురాలి మనవడు తులసి వెంకటనారాయణ పిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

పుష్పగిరిలో బ్రహ్మసూత్ర శివలింగాలు



గంగాధరేశ్వర స్వామి ఆలయం



కాశీవిశ్వేశ్వరస్వామి ఆలయం

వల్లూరు, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): మండలంలో అత్యంత ప్రసిద్ధి చెందిన పుష్పగిరిలో వెలసిన లక్ష్మీచెన్నకేశవస్వామి ఆలయ గాలిగోపురం పక్కనున్న గంగాధరేశ్వర స్వామి ఆలయంలోని శివలింగానికి, అలాగే శివాలపల్లెలోని కాశీవిశ్వేశ్వరస్వామి ఆలయ శివలింగానికి బ్రహ్మసూత్రం ఉన్నట్లు తన పరిశోధనలో తేలిందని రచయిత, చరిత్రకారుడు బొమ్మిశెట్టి రమేశ్ తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ పురాతన శివాలయాల్లో శివలింగంపై నిలువు గీతలుంటాయన్నారు. ఇవి చాలా అత్యంత అరుదైనవని, అన్ని శివాలయాల్లోని శివలింగాలకు ఈ విధమైన గీతలుండవని వివరించారు. ఇలా శివలింగంపై గీతలుండడాన్ని బ్రహ్మసూత్రం అంటారని, బ్రహ్మసూత్రాలను వేదసూత్రాలని కూడా అంటారని తెలిపారు. బ్రహ్మసూత్రమంటే అంతిమ వాస్తవం, మోక్షమార్గం అనే అర్థాలున్నాయని, బ్రహ్మసూత్రాలపై ఆదిశంకరాచార్యులు అనేక వివరణలిచ్చారని వివరించారు. విముక్తి పొందిన ఆత్మకు, అంతర్గత జ్ఞానం, బలం ఉంటాయని, దుఃఖం నుంచి విముక్తి పొందుతారని బ్రహ్మసూత్రం వివరిస్తుందన్నారు. 555 బ్రహ్మ సూత్రాలుయన్నారు. వెయ్యిసార్లు ఒక శివాలయానికి వెళ్తే ఎంత ఫలితం వస్తుందో ఒక్క బ్రహ్మసూత్ర శివలింగాన్ని దర్శిస్తే అంతే ఫలితం వస్తుందన్నారు, శివాలపల్లె కాశీవిశ్వేశ్వరస్వామి ఆలయంలోని శివలింగానికి బ్రహ్మసూత్రం మధ్యలో ఒక నిలువాటి స్తూపాకార గీతుంటే దానికి కొంచెం కిందగా పార్శ్వ భాగాల్లో వంపు తిరిగిన గీతలున్నాయని, అలాగే గంగాధరేశ్వరస్వామి ఆలయంలోని బ్రహ్మ సూత్ర శివలింగం మధ్యలో స్తూపాకార గీతుంటే దానికి సమానంగా పార్శ్వ భాగాల్లో కోణీయ నిలువు రేఖలు, వాటికి కింది తలంలో వంపు తిరిగిన గీతలున్నాయన్నారు.

టీడీపీ నేతలతో చమర్తి భేటీ



టీడీపీ నాయకులతో మాట్లాడుతున్న జగన్‌మోహన్‌రాజు

సుండుపల్లె, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి చప్పిడి మహేశ్‌నాయుడు స్వగృహంలో టీడీపీ నేతలతో టీడీపీ రాజంపేట నియోజకవర్గ ఇన్‌చార్జి జగన్‌మోహన్‌రాజు భేటీ అయ్యారు. ఆదివారం సుండుపల్లె పర్యటనలో భాగంగా గ్రామానికి వచ్చిన జగన్‌మోహన్‌రాజుకు చప్పిడి సోదరులు స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు రమేశ్‌నాయుడు తదితరులు పాల్గొన్నారు.

'రాయచోటిలో అభివృద్ధి శూన్యమనడం అవివేకం'

రాయచోటిటౌన్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): వైసీపీ ప్రభుత్వ హయాంలో రాయచోటిలో అభివృద్ధి శూన్యమని మాట్లాడడం వారి అవివేకానికి నిదర్శనమని వైసీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గడికోట శ్రీకాంత్‌రెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో అన్నారు. తాము చేసిన అభివృద్ధిని ఆధారాలతో చూపిస్తున్నామన్నారు. మభ్యపెట్టే వాళ్లమైతే ఆధారాలతో మాట్లాడమన్నారు. రాయచోటి రింగురోడ్డు, పట్టణంలో తాగునీటి సమస్యను తీర్చడానికి ఎంతో కృషి చేశానన్నారు. అధికారం ఉంది కదా అని హేళనగా మాట్లాడడం సంస్కారం కాదన్నారు. 18 నెలల పాలనలో క్రిటికల్ కేర్ యూనిట్ తప్ప మీరు కొత్తగా మంజూరు చేసింది ఏమీ లేదన్నారు. సోషల్ మీడియాలో పోస్టులు పెడుతున్న వైసీపీ కార్యకర్తలను స్టేషన్‌కు పిలిపించి కొట్టడం, హింసించడం సమంజసం కాదన్నారు. అన్యాయాలకు పాల్పడుతున్న అధికారులను తాము గుర్తుకు పెట్టుకుంటామని హెచ్చరించారు.

అంగన్వాడీ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

రాయచోటిటౌన్, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): రాయచోటి ఐసీడీఎస్ ప్రాజెక్ట్ పరిధిలోని అంగన్వాడీ కేంద్రాల్లో ఖాళీగా ఉన్న కార్యకర్త, హెల్పర్ పోస్టుల భర్తీకి అర్హులైన మహిళలు దరఖాస్తు చేసుకోవాలని సీడీపీవో శశికళ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. రాయచోటి, సంబేపల్లె మండలం ఆవులవాండ్లపల్లె (వీహెచ్) లో కార్యకర్త పోస్టులు, రాయచోటి మండలం మాధవరం గ్రామం బొట్లచెరువు, సంబేపల్లె మండలం దిగువరాజుగారిపల్లెలో ఆయా పోస్టులు (వీహెచ్) ఖాళీగా ఉన్నట్లు ఆమె తెలిపారు. 21 ఏళ్ల నుండి 35 ఏళ్ల లోపు వయసు కలిగి, పదవ తరగతి పాసైన, స్థానిక వివాహిత మహిళలు మాత్రమే అర్హులన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు ఈ నెల 7వ తేదీలోపు రాయచోటి ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయంలో దరఖాస్తులను అందించాలని సూచించారు.

తుఫాను నేపథ్యంలో గ్రామాల పరిశీలన



ఎల్లమరాజుచెరువు వద్ద పరిశీలిస్తున్న సీఐ శ్రీనివాసులు, సిబ్బంది

చిట్వేలి, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి) : తుఫాను నేపథ్యంలో కోడూరు రూరల్ సీఐ డి.శ్రీనివాసులు చిట్వేలి మండలంలోని నాగవరం, చెర్లోపల్లె, ఎల్లమరాజుచెరువు, కేఎస్ అగ్రహారం, గుంజనేరు ప్రాంతాలను ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తుఫాను తీవ్రత అధికంగా ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. చిట్వేలి మండలంలో తుఫాను ప్రభావిత ప్రాంతాల ప్రజలకు తగిన సూచనలు, సలహాలిచ్చారు. సమస్యాత్మక ప్రదేశాల వద్ద పోలీసు సిబ్బందిని ఏర్పాటు చేశారు. చెరువులు, కుంటల వద్దకు వెళ్లవద్దని సూచించారు. ఈ కార్యక్రమంలో ట్రైనీ ఎస్ఐతోపాటు, రాజుకుంట సర్పంచ్ నరసింహ, చెర్లోపల్లె గ్రామ ప్రజలు, పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రాయచోటి మాకొద్దు..

- వర్షంలోనూ.. కొనసాగిన ఆందోళన
- పల్లెల్లోనూ వెల్లువెత్తిన నిరసన



రాజంపేటలో ఆందోళన చేస్తున్న జిల్లా సాధన సమితి సభ్యులు



శెట్టిగుంట వద్ద ఆందోళన చేస్తున్న గ్రామస్థులు, మైనార్టీ నేతలు



భక్తకన్నప్ప జన్మస్థలి ఊటుకూరులో ఆందోళన చేస్తున్న నాయకులు

రాజంపేట, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి) : జిల్లా కేంద్రంగా రాజంపేటే ముద్దు.. రాయచోటి మాకొద్దంటూ రాజంపేట నియోజకవ్యాప్తంగా వెలువెత్తుతున్న నిరసనలు ఆదివారం హోరు వర్షంలోనూ కొనసాగాయి. తిరుపతి జిల్లాకు సమీపంలోని రైల్వేకోడూరు మండలం శెటిగుంట గ్రామంలో ముస్లింలు, చుట్టుపక్కల గ్రామాల ప్రజలు ప్లకార్డులు చేతబట్టి నిరసన ప్రదర్శించారు. తిరుపతికి సమీపంలోని రైల్వే కోడూరును రాయచోటి జిల్లా కేంద్రంలో కలపడం తమకు అన్ని విధాలా అసౌకర్యమని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రాయచోటి వద్దు - రాజంపేట ముద్దు అంటూ నినాదాలు చేశారు. రైల్వే కోడూరులో పలువురు వృద్ధులు, యువకులు రాజంపేటను జిల్లా కేంద్రం చేయాలని కోరుతూ టీ బంకులు దుకాణాల వద్ద వర్షంలోనే నిరసన వ్యక్తం చేశారు. రాజంపేట జేఏసీ ఆధ్వర్యంలో నినాదాలు చేస్తూ ఆందోళనలు నిర్వహించారు. అన్ని వసతులున్న రాజంపేటనే జిల్లా కేంద్రం చేయాలన్నారు. జేఏసీ నాయకులు తరిగోపుల లక్ష్మీనారాయణ, అబ్బూరు ప్రభాకర్ నాయుడు, పూల విజయభాస్కర్ తదితరులు మాట్లాడుతూ అన్నమయ్య జిల్లాను వేరుచేసి ప్రస్తుతం రాయచోటి కేంద్రంగా జిల్లాను కొనసాగించడం దారుణమన్నారు. కోడూరుకు, రాయచోటికి మధ్యలో ఉన్న రాజంపేటను జిల్లా కేంద్రం చేయాలన్నారు. తిరుపతి జిల్లాను ఆనుకుని ఉన్న కోడూరు, ప్రజలందరికీ అనుకూలంగా ఉన్న ప్రాంతాన్ని జిల్లా కేంద్రంగా చేయాలే తప్ప.. మూడు గంటలు ఘాట్‌రోడ్డులో ప్రయాణం చేయాల్సి ఉన్న రాయచోటిని జిల్లా కేంద్రంగా కొనసాగించడం సబబు కాదన్నారు. ఈ ఆందోళన ప్రజా ఉద్యమంగా మారనుందని హెచ్చరించారు. భక్తకన్నప్ప జన్మస్థలమైన ఊటుకూరులోనూ రాజంపేట జిల్లా కేంద్రం చేయాలని కోరుతూ ఆందోళన నిర్వహించారు. ఇదిలా ఉండగా.. జిల్లాల పునర్విభజనపై బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తీవ్రంగా స్పందించారు. ఈ మేరకు ట్విట్టర్‌లో తమ అభిప్రాయాన్ని పోస్టు చేశారు. జిల్లాల పునర్విభజన, కమిటీ నిర్ణయాలు ప్రజల అంచనాలకు తగ్గట్టు లేవని, నిర్ణయాల్లో అవగాహన లోపం స్పష్టంగా కనిపిస్తోందన్నారు. ప్రజల విస్తృత ప్రయోజనాలు, ప్రాంతీయ ఆకాంక్షలకు అనుగుణంగా లేవని తెలిపారు. ప్రభుత్వం పునరాలోచన చేసి ప్రజాభిప్రాయానికి అనుగుణంగా జిల్లా విభజన పునరాలోచించాలని పేర్కొన్నారు.

సిద్దవటంలో సంతకాల సేకరణ

సిద్దవటం: సిద్దవటం మండలాన్ని అన్నమయ్య జిల్లాలో చేర్చడంపై మండలంలో సంతకాల సేకరణ జోరందుకుంది. ప్రజలు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి గెజిట్ నోటిఫికేషన్‌కు వ్యతిరేకంగా సంతకాలు చేశారు. ఈ సందర్భంగా టీడీపీ నేత మల్లు వెంకట సుబ్బారెడ్డి, మైనార్టీ నేత షేక్‌గౌస్ బాషా మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్ పరిశీలించి సిద్దవటం మండలాన్ని కడపజిల్లాలోనే ఉంచాలని సిద్దవటం మండలం లింగంపల్లె, పెన్నానది నుంచి కడప ప్రజలకు తాగునీరు అందిస్తున్నామని, సిద్దవటం మండలం విలీనంపై అధికారులు పరిశీలించి న్యాయం చేయాలన్నారు.

12వ పీఆర్సీ నియమించి, బకాయిలు చెల్లించాలి

- యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు నక్కా వెంకటేశ్వర్లు డిమాండ్



యూటీఎఫ్ జిల్లా ఆఫీస్ బేరర్ల సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర అధ్యక్షుడు వెంకటేశ్వర్లు

రాయచోటి టౌన్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): 12వ పీఆర్సీ నియమించి ఐఆర్ ప్రకటించాలని యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు నక్కా వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. ఆదివారం పట్టణంలోని యూటీఎఫ్ జిల్లా కార్యాలయంలో జిల్లా ఆఫీసు బేరర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వం ఉద్యోగ ఉపాధ్యాయులకు 11వ పీఆర్సీ, డీఏలు, సరెండర్ లీవులు తదితరాలు చెల్లించలేదన్నారు. ప్రస్తుత ప్రభుత్వం వెంటనే 12వ పీఆర్సీ కమిషన్ ఏర్పాటు చేసి పెండింగ్ డీఏలను చెల్లించాలని డిమాండ్ చేశారు. టెట్, ఇతర ఉపాధ్యాయ, విద్యారంగ సమస్యల పరిష్కారానికి కార్యచరణ రూపొందించామన్నారు. ఈ నెల 10న డివిజన్ కేంద్రంలో నిరసన ర్యాలీలు, 18న డీఈవో కార్యాలయం ఎదుట ధర్నా, 2026 జనవరి 4న భీమవరంలో రాష్ట్ర స్థాయి ర్యాలీ, జనవరి 29న ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద ధర్నా ఉంటుందన్నారు. ఉపాధ్యాయులకు టెట్‌లో మినహాయింపు ఇవ్వాలని, జూన్‌లో బదిలీ అయిన ఉపాధ్యాయులను రిలీవ్ చేయాలని, ఎంటీఎస్ ఉపాధ్యాయులకు పదవీ విరమణ వయస్సు 62 సంవత్సరాలకు పెంచి రెగ్యులర్ చేయాలన్నారు. 100 రోజులు ఎస్ఎస్‌సీ యాక్షన్ ప్లాన్‌లో సెలవు దినాలను మినహాయించాలని, సింగిల్ టీచర్ ప్రాథమిక పాఠశాలల్లో అకడమిక్ ఇన్‌స్ట్రక్టర్లను నియమించాలని, పీఎస్‌హెచ్ఎం, క్లస్టర్ టీచర్స్ సమస్యలు పరిష్కరించాలని, పరీక్షల విధానంలో మార్పులు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి లక్ష్మీరాజా మాట్లాడుతూ రిటైరైన వారికి గ్రాట్యుటీ, కమ్యుటేషన్, లీవ్ ఎన్‌క్యాషెమెంట్ ఇతర బకాయిలను వెంటనే చెల్లించాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు హరిప్రసాద్, జాబీర్, జిల్లా గౌరవాధ్యక్షులు సుధాకర్‌నాయుడు, జిల్లా సహాధ్యక్షుడు శివారెడ్డి, సహాధ్యక్షురాలు హేమలత, జిల్లా కోశాధికారి చంద్రశేఖర్, జిల్లా కార్య దర్శులు వెంకటసుబ్బయ్య, శ్రీధర్‌రెడ్డి, అక్రంబాషా, భాస్కర్‌రెడ్డి, ఆదినారా యణ, దావుద్దీన్, పురుం వెంకట్రమణ, జిల్లా ఆడిట్ కన్వీనర్ సురేంద్రారెడ్డి, ప్రచురణల విభాగం కన్వీనర్ విజయకుమార్, రాష్ట్ర కౌన్సిలర్ శివారెడ్డి, కిఫాయత్ తదితరులు పాల్గొన్నారు.

భక్తి శ్రద్ధలతో అయ్యప్ప స్వామికి పూజలు



ప్రత్యేక అలంకరణలో అయ్యప్ప స్వామి



వన్ పులివాహనంపై అయ్యప్పస్వామి



అయ్యప్ప పూజలో పాల్గొన్న ముస్లింలు

సుండుపల్లె, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో తోట రవీంద్ర కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో ఆదివారం అయ్యప్ప పూజ నిర్వహించారు. పడికట్లను తయారు చేసి అయ్యప్ప, వినాయక స్వామి, సుబ్రమణ్యం స్వామిని ఆసీనులను చేసి పూజలు నిర్వహించారు. అనంతరం భిక్ష ఏర్పాటు చేశారు. గురుస్వాములు, అయ్యప్ప భక్తులు పాల్గొన్నారు.

పులివాహనం ఉత్సవం

ఓబులవారిపల్లె: మండల పరిధిలోని మంగంపేట గ్రామ పంచాయతీ పరిధిలో ఆదివారం అయ్యప్ప స్వామికి వన్ పులి వాహనం గ్రామోత్సవం నిర్వ హించినట్లు గ్రామ ప్రజలు తెలిపారు. గునిపాటి వేణుగోపాల్, పోతల లక్ష్మీనారాయణ, అయ్యప్ప స్వాముల ఆధ్వర్యంలో శరణాలు పలుకు తూ భజనలు చేస్తూ భక్తులు గ్రామోత్సవంలో పాల్గొన్నారు.

ముస్లింల అన్నదానం

లక్కిరెడ్డిపల్లె : దైవం అందరికీ ఒక్కటేనని మార్కెట్‌యార్డు చైర్మన్ ఎస్ఎండీ షఫీనాయక్ అన్నారు. ఆదివారం మధ్యాహ్నం నామాల గుండు వద్ద అన్వర్‌బాషా, ఫైరా ముకియార్ పటేల్, సాదుల్లా తదితరులు అయ్యప్ప భక్తులకు అన్నదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మతాలు వేరైనా భగవంతుడు మాత్రం ఒక్కడేనన్నారు. ఈ కార్యక్రమంలో గురుస్వామి వెంకటేశ్వర్లు, సెల్లు గంగరాజు, రమణస్వామి, విజయభాస్కర్, రెడ్డి బాషా, రిజ్వాన్, దర్బార్, అయ్యప్ప భక్తులు పాల్గొన్నారు.

ముస్లింల హక్కుల పరిరక్షణకు చర్యలు తీసుకోవాలి

- ఇన్సాఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జాఫర్



జాఫర్‌ను సన్మానిస్తున్న ఇన్సాఫ్ సభ్యులు

రాయచోటిటౌన్, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): ముస్లింల రాజ్యాంగబద్ధ హక్కులు, సామాజిక భద్రత, విద్యా- ఆర్థిక పురోగతిని ప్రభుత్వాలు నిర్లక్ష్యం చేస్తున్నాయని ఇన్సాఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జాఫర్ అన్నారు. ఆదివారం సీపీఐ జిల్లా కార్యాలయంలో రాయచోటి నియోజకవర్గ ఇన్సాఫ్ కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఇటీవల దేశంలో రాష్ట్రంలో చోటు చేసుకుంటున్న వివక్షాత్మక ఘటనలు, సంక్షేమ పథకాల అమలులో లోపాలు, సమాజంలో పెరుగుతున్న అసహనం ఆందోళన కలిగిస్తున్నాయన్నారు. ప్రతి జిల్లాలో మైనార్టీ హెల్ప్ సెంటర్, లీగల్ ఎయిడ్ ఏర్పాటు చేయాలన్నారు. ముస్లిం విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు, పాఠశాలలు, కాలేజీల్లో ప్రత్యేక కోచింగ్ సదుపాయాలు, ఉద్యోగాలు, స్వయంఉపాధి పథకాల్లో ప్రాధాన్యం కల్పించాలన్నారు. మైనార్టీ ప్రాంతాల్లో మౌలిక వసతులు మెరుగుపరచాలన్నారు. ముస్లిం మైనార్టీ సమాజం అభివృద్ధి, రాష్ట్ర అభివృద్ధిలో అంతర్భాగం, సమానత్వం, సహకారం, సామాజిక న్యాయం కోసం ప్రభుత్వం తక్షణం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఇన్సాఫ్ సంఘం అన్నమయ్య జిల్లా బాధ్యులు సిద్దిగాళ్ల శ్రీనివాసులు, ఇన్సాఫ్ నియోజకవర్గ నాయకులు నవాజ్, అస్లాం, ఫజల్, రఫీ తదితరులు పాల్గొన్నారు.



ఉపాధ్యాయులే సమాజ నిర్మాతలు

- టీడీపీ నాయకుడు డాక్టర్ మండిపల్లి లక్ష్మీప్రసాద్‌రెడ్డి



రవీంద్రనాథ్‌బాబు దంపతులను సన్మానిస్తున్న మండిపల్లి లక్ష్మీప్రసాద్‌రెడ్డి

రాయచోటిటౌన్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): సమాజ నిర్మాతలు ఉపాధ్యాయులేనని, ఉత్తమ సేవలు అందించడం ద్వారానే వారికి సమాజంలో గుర్తింపు లభిస్తుందని తెలుగుదేశం పార్టీ నాయకుడు డాక్టర్ మండిపల్లి లక్ష్మీప్రసాద్‌రెడ్డి అన్నారు. ఆదివారం రాయచోటి పట్టణంలోని అజయ్ రెసిడెన్సీలో కాటిమాయకుంట హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడు రవీంద్రనాథ్‌బాబు పదవీ విరమణ సన్మాన సభకు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మా ట్లాడుతూ అన్ని వృత్తులతో పోలిస్తే ఉపాధ్యాయ వృత్తి అత్యంత పవిత్రమైందని, లక్షలాది మంది విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దే గొప్ప బాధ్యత గురువులదేనన్నారు. అనంతరం జిల్లా విద్యాశాఖ అధికారి సుబ్రమణ్యం మాట్లాడుతూ రవీంద్రనాథ్‌బాబు విద్యారంగంలో అందించిన సేవలు ఆదర్శప్రాయమని కొనియాడారు. నిరుపేద విద్యార్థుల అభ్యున్నతికి తన సేవా కాలం మొత్తం అంకితమై పనిచేశారని, వృత్తి నిబద్ధతతో ముందు తరాలకు మార్గదర్శిగా నిలిచారన్నారు. ఈ కార్యక్రమంలో డైట్ ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ మడితాటి నరసింహారెడ్డి, ఏపీఐసీ డైరెక్టర్ కొండా భాస్కర్‌రెడ్డి, హెచ్ఎం అసోసియేషన్ నాయకులు రామకృష్ణ, నాగమునిరెడ్డి, ఆర్‌జేయూపీ అధికార ప్రతినిధి ముత్యాజీ వీరబ్రహ్మం, రాష్ట్ర అధ్యక్షుడు గునిశెట్టి శ్రీనివాసులు, జనరల్ సెక్రటరీ షరీఫ్, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూములను ఆక్రమిస్తే చర్యలు



గ్రామస్తులతో మాట్లాడుతున్న తహసీల్దార్ వెంకటేశులు

రామాపురం, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని 14 గ్రామ పంచాయతీ పరిధిలో ఉన్న ప్రభుత్వ భూములు, పంటలు, వాగులు ఎవరైనా ఆక్రమిస్తే చర్యలు తప్పవని రామాపురం తహసీల్దార్ వెంకటేశ్వర్లు హెచ్చరించారు. మండలంలోని నల్లగుటపల్లి పంచాయతీ కొత్తపల్లి సమీపంలో ఉన్న ప్రభుత్వ భూమి ఆక్రమణకు గురవుతోందన్న ఫిర్యాదుతో అక్కడికి వెళ్లి పరిశీలించినట్లు తెలిపారు. ఆక్రమణదారులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. దిత్వా తుఫాన్ ఉండడంతో ప్రజలు అత్యవసరం ఉంటేనే బయటికి రావాలన్నారు. పశువులను భద్రంగా కాపాడుకోవాల న్నారు. పిల్లలు కుంటలు, చెరువుల వద్దకు వెళ్లకుండా జాగ్రత్తగా తీసుకోవాల్సిన బాధ్యత తల్లిదండ్రులపై ఉందన్నారు. గ్రామాల్లో అత్యవసర పరిస్థితుల్లో రామాపురం తహసీల్దార్ కార్యాలయానికి టోల్ ఫ్రీ నెంబర్ 9441636606ను సంప్రదించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ సమ్మత్‌ఖాన్, వీఈఆర్వో ఈశ్వరయ్య, విఘ్నేశ్, వీఆర్ఏ వెంకట్రమణ, ప్రజలు పాల్గొన్నారు.

రామాపురం మండల ఎస్టీయూ కార్యవర్గం ఎన్నిక



గోపీకృష్ణ శ్రీనివాసులు రియాజ్

రామాపురం, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): రాయచోటిలోని డైట్ కేంద్రంలో ఆదివారం నిర్వహించిన ఎస్టీయూ రాయచోటి రీజియన్ సమావేశంలో నూతన కార్యవర్గాన్ని ఎంపిక చేశారు. మండల గౌరవాధ్యక్షు డుగా అబ్దుల్‌మునాఫ్, అధ్యక్షుడుగా నిడిగింటి గోపీకృష్ణ, ప్రధాన కార్యదర్శిగా పూజారి శ్రీనివాసులు, ఆర్థిక కార్యదర్శిగా చిత్తూరు రియాజ్, మహిళా కన్వీనర్‌గా భారతమ్మ, మైనార్టీ కన్వీనర్‌గా ఇమ్తియాజ్‌బాషా, జిల్లా కార్యదర్శిగా వెంకట్రామిరెడ్డి, జిల్లా కౌన్సిలర్లుగా మధుసూదన్‌రెడ్డి, సునీల్, ఆర్థిక కమిటీ సభ్యులుగా బాబా ఎంపికయ్యారు. జిల్లా అధ్యక్షుడు అంకం శివారెడ్డి, రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ రవీంద్రనాథ్‌రెడ్డి అభినందనలు తెలిపారు.

దిత్వా తుఫానుతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలి



గంగలచెరువును పరిశీలిస్తున్న ఎంపీడీవో సుజాతమ్మ

ఒంటిమిట్ట, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి):దిత్వా తుఫాను కారణంగా మండల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎంపీడీవో సుజాతమ్మ తెలిపారు. ఆదివారం మండలంలోని నరసన్నగారిపల్లె,పెన్న పేరూరు, గంగపేరూరు, చిన్నకొతపల్లె, రాచగుడిపల్లె గ్రామాల్లో ఆమె పర్యటించారు. గంగల చెరువును పరిశీలించారు. ఈవోపీఆర్డీ శ్రీలత, జూనియర్ అసిస్టెంట్ లక్ష్మీ, గంగల చెరువు చైర్మన్ వెంకటరమణ, టీడీపీ నాయకులు బొబ్బిలి రాయుడు, మండల టీడీపీ క్లస్టర్ కోకన్వీనర్ కట్టా సుబ్బరాయుడు, పి.వెంకటేష్, శ్రీనివాసులు, కొండయ్య పాల్గొన్నారు.

ఆదర్శ ఉపాధ్యాయుడు వేణుగోపాల్



వేణుగోపాల్‌ను సత్కరిస్తున్న విద్యాశాఖాధికారులు

రాజంపేట, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి) : సుదీర్ఘకాలం అంకితభావంతో విధులు నిర్వహించిన తుమ్మలపెంట వేణుగోపాల్ ఉపాధ్యాయ లోకానికే వన్నె తెచ్చారని విద్యాశాఖాధికారులు ప్రస్తుతించారు. ఆదివారంరాజంపేట మండలం వరదయ్యగారిపల్లె ప్రధానోపాధ్యాయుడు తుమ్మలపెంట వేణుగోపాల్ పదవీ విరమణ సందర్భంగా పలువురు ఆయనను సత్కరించారు. ఈ సందర్భంగా అన్నమయ్య జిల్లా ఉప విద్యాశాఖాధికారి నాగయ్య, ఎంఈవోలు చక్రధర్‌రాజు, రఘునాథ్‌రాజు, నారాయణరాజు, జూనియర్ కళాశాల విశ్రాంత ప్రిన్సిపాల్ రజనీకాంత్‌రెడ్డి, ఉపాధ్యాయ నాయకులు సాయి, ఆర్ఐవో భానుమూర్తిరాజు తదితరులు మాట్లాడుతూ ఉపాధ్యాయుడిగా, ఎస్టీయూ నాయకుడిగా కోడూరు, రాజంపేట నియోజకవర్గాల్లో పనిచేసి పలువురిని ఉన్నత, ఉత్తమ విద్యార్థులుగా తీర్చిదిద్దారని కొనియాడారు.

గురజాడకు నివాళి



గురజాడ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న గంగనపల్లి వెంకటరమణ

రాజంపేట, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి) : సంఘ సంస్కర్త, మహాకవి గురజాడ వెంకట అప్పారావు 110వ వర్ధంతి సందర్భంగా స్థానిక సరస్వతి విద్యామందిరంలో ఉపాధ్యాయ సంఘం నేతలు గంగనపల్లె వెంకటరమణ, బొట్టా రామచంద్రనాయుడు, తెలుగు ఉపాధ్యాయుడు శ్రీనివాసులు, పీ ఎల్ఎస్వీ ప్రసాదరావు, పి. సురేంద్రకుమార్ గురజాడ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆధునిక సాహిత్యానికి గురజాడ వేగు చుక్క అని కొనియాడారు. తన అమూల్యమైన రచనలతో సమాజ పరివర్తన కోసం పరితపించిన మహానుభావుడన్నారు. సమాజ దురాచారాలను తన కలం అనే కత్తితో రూపుమాపారని, ఆయన రచనలు నేటి సమాజానికి మార్గదర్శకమని కొనియాడారు.

ఉత్తమ వాకర్ శరత్‌కుమార్‌రాజుకు సన్మానం



శరత్‌కుమార్‌రాజును సత్కరిస్తున్న వాకర్స్ ఇంటర్నేషనల్ సభ్యులు


రాజంపేట టౌన్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి) : సేవా కార్యక్రమాలు నిర్వహించినందుకు రాజంపేట వాకర్స్ ఇంటర్నేషనల్ సభ్యుడు కొండూరు శరత్‌కుమార్ రాజును ఘనంగా సత్కరించారు. భీమవరంలో ఆదివారం జరిగిన వాకర్స్ ఇంటర్నేషనల్ సమావేశంలో వాకర్స్ ఇంటర్నేషనల్ అధ్య క్షు లు ప్రభావతి, భీమవరం వాకర్స్ జిల్లా గవర్నర్ రామరాజు మాజీ అధ్యక్షుడు సీతారామయ్య ఆ సంఘ నాయకులు సుబ్బారెడ్డి, మురళీమోహన్ తదితరులు ఘనంగా సత్కరించి ప్రశంసించారు. కొండూరు శరత్‌కుమార్‌రాజు వాకర్స్ ఇంటర్నేషనల్ సభ్యులుగా పదేళ్లుగా కొనసాగుతూ నడక గొప్పతనంపై ప్రజలకు అవగాహన కల్పించడంతో పాటు, పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారని కొనియాడారు.

'భగవద్గీతతో మానవాళికి మార్గదర్శనం'

ఒంటిమిట్ట, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి) : భగవద్గీత మానవాళి మనుగడకు మార్గాన్ని నిర్దేశిస్తుందని ఒంటిమిట్ట పోతన సాహిత్యపీఠం అధ్యక్షుడు పసుపులేటి శంకర్ తెలిపారు. ఆదివారం కడప ఆకులవీధిలోని రాజరాజేశ్వరి ఆలయ ప్రాంగణంలో భగవద్గీత జయంతి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన భగవద్గీత విశిష్టతను వివరించారు. భగవద్గీత ద్వాపర యుగం నాటిదైనా.. కలియుగంలో భారతదేశంలోనే కాకుండా ప్రపంచంలోని పలు దేశాల్లో ఆయా భాషల్లో అచ్చయిందన్నారు. శ్రీకృష్ణ భగవానుడు అర్జునుడికి చెప్పిన భగవద్గీత ప్రతి మనిషి జీవితానికి అన్వయమయ్యేదన్నారు. ఈ కార్యక్రమంలో సత్సంగ కోశాధికారి సుబ్రమణ్యం, కార్యనిర్వహణ అధ్యక్షుడు సత్యనారాయణ గుప్తా, ఉపాధ్యక్షుడు కిశోర్‌కుమార్, రమణ మూర్తి, చంద్రనాయక్ తదితరులు పాల్గొన్నారు.

అబాకస్ మ్యాథ్స్ పోటీల్లో విద్యార్థి ప్రతిభ

సుండుపల్లె, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ స్థాయిలో మలేషియాలో విశ్వం ఎడ్యు టెక్ ల్యాబ్ హైదరాబాద్ వారు నిర్వహించిన అబాకస్ వేదిక్ మ్యాథ్స్ పోటీలో తమ పాఠశాల విద్యార్థుల ప్రతిభ కనపర్చినట్లు వశిష్ట పాఠశాల కరెస్పాండెంట్ రెడ్డెయ్యరాజు తెలిపారు.



గండికోటలో రాక్‌క్లైంబింగ్

జమ్మలమడుగు, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): జమ్మలమడుగు మండలంలోని పర్యాటక ప్రాంతమైన గండికోటలో ఆంధ్రప్రదేశ్, తెలంగాణాకు చెందిన విద్యార్థులకు రాక్ క్లైంబింగ్‌పై శిక్షణ ఇచ్చారు. అడ్వెంచర్ స్పోర్ట్స్ అకాడమీ గండికోట ఆధ్వర్యంలో ఈ శిక్షణ ఆదివారం మూడవ రోజుకు చేరుకుంది. వివిధ పాఠశాలలు, కళాశాలలకు చెందిన సుమారు వంద మందికిపైగా విద్యార్థులు అడ్వెంచర్ రంగంలో అవసరమైన నైపుణ్యాలను నేర్చుకున్నారు. దీంతో యువతలో శారీరక దృఢత్వం, నైపుణ్యం కలిగి ఉంటారని నిర్వాహకులు తెలిపారు.

గండికోట ప్రాజెక్టులో 26.3 టీఎంసీల నీటిమట్టం

కొండాపురం, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): గండికోట ప్రాజెక్టులో ఆదివారం 26.324 టీఎంసీల నీటిమట్టం ఉన్నట్లు ఈఈ ఉమామహేశ్వర్లు తెలిపారు. ప్రస్తుతం తాగునీటి అవసరాల దృష్ట్యా 20 క్యూసెక్కుల నీరు మాత్రమే బయటికి వదులుతున్నామన్నారు. అదేవిధంగా ప్రస్తుతం ప్రాజెక్టులోకి వచ్చే ఇన్‌ఫ్లో లేదని ఈఈ తెలిపారు. కాగా గండికోట ప్రాజెక్టు పూర్తి నీటి సామర్థ్యం 26.85 టీఎంసీలు.

అప్రమత్తంగా ఉండాలి

పెద్దమండ్యం, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): సైబర్ మోసగాళ్లతో ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా వుండాలని కలిచెర్ల జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ అమరేంద్ర కుమార్, ఎన్ఎస్ఎస్ పీవో వెంకటనరసయ్య తెలిపారు. ఆదివారం ఎన్‌వోపల్లిలో ఎన్ఎస్ఎస్ క్యాంప్‌లో భాగంగా మత్తు పదార్థాలు, సైబర్ మోసాలు, పరిసరాల పరిశుభ్రతపై ఆ గ్రామ ప్రజలకు అవగాహన కల్పించి ర్యాలీ నిర్వహించారు. ఎన్‌వోపల్లి పాఠశాల ఆవరణంలో మొక్కలు నాటడానికి గుంతలు తవ్వారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ఆరోగ్య సలహాలు అందించారు. కార్యక్రమంలో సర్పంచ్ పద్మావతి, ఎన్ఎస్ఎస్ విద్యార్థులు, అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

సదరం సర్టిఫికెట్లలో తప్పులను సవరించాలి

ప్రొద్దుటూరు టౌన్, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): సదరం సర్టిఫికెట్లలో తప్పులను సవరించడానికి చర్యలు తీసుకోవాలని వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్‌కు ఆల్‌ఆఫ్‌యూ దివ్యాంగుల సేవా సొసైటీ ఆధ్వర్యంలో దివ్యాంగులు రాయల్‌కౌంటీలో ఆదివారం వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా సంఘం రాష్ట్ర కన్వీనర్ అఫ్జల్ మాట్లాడుతూ దివ్యాంగులకు కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ విధానంలో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించాలని కోరారు. సదరం సర్టిఫికెట్ రీవెరిఫికేషన్‌లో అనేక తప్పులు దొర్లాయని, అలాగే పోలియోతో రెండుకాళ్లు చచ్చుబడిన దివ్యాంగులకు పర్సంటేజీని తగ్గించారన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ డీసీహెచ్‌తో మాట్లాడి తగిన చర్యలు తీసుకుంటామని, దివ్యాంగులకు ఏవైనా సమస్యలుంటే తమ దృష్టికి తెస్తే పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు.



మంత్రి సత్యకుమార్‌యాదవ్‌కు వినతిపత్రం అందిస్తున్న దివ్యాంగులు

పాలకుల నిర్లక్ష్యంతోనే సీమ వెనుకబాటు

- శిలాఫలకాలు, హామీలకే పరిమితమైన కడప ఉక్కుపరిశ్రమ
- మధ్యలోనే ఆగిన కడప-బెంగళూరు రైల్వేలైన్
- ఉద్యమానికి సన్నద్ధం కాకపోతే అధోగతే
- రౌండ్‌టేబుల్ సమావేశంలో పలు పార్టీలు, ప్రజాసంఘాల నేతలు



సంఘీభావం తెలుపుతున్న పలు పార్టీల, ప్రజాసంఘాల నేతలు

కడప మారుతీనగర్, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): దేశానికి స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుండి మన రాష్ట్రానికి ముఖ్యమంత్రులుగా రాయలసీమకు చెందిన నాయకులు పాలన చేసినప్పటికీ సీమ వెనుకబాటుకు గురైందని పలు పార్టీల, ప్రజా సంఘాల నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు. రెవల్యూషనరీ స్టూడెంట్స్ ఫెడరేషన్ (ఆర్ఎస్ఎఫ్) రాయలసీమ ప్రాంతీయ కమిటీ సారథ్యంలో ఆ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు డీఎం ఓబులేసు యాదవ్ ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో కడప ఉక్కు పరిశ్రమ, ప్రభుత్వ మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణ, కడప-బెంగుళూరు రైల్వేలైన్ అంశాలపై ప్రత్యేక రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పలు పార్టీల నాయకులు అవ్వారు మల్లికార్జున (జేసీఐ), సత్తార్ కె.లక్ష్మయ్య(కాంగ్రెస్), రామ్మోహన్(సీపీఎం), వెంకటశివ(సీపీఐ), సంగటి మనోహర్(ఎంఆర్‌పీ), సగిలి గుర్రప్ప(బీఎస్‌పీ), ప్రతాప్‌రెడ్డి(జనతాదళ్), సలావుద్దీన్(ముస్లిం సమైక్యవేదిక), ప్రసాద్ (ఆర్‌సీపీ), శ్రీనివాసులు(ఆమ్‌ఆద్మీపార్టీ), దేవర శ్రీకృష్ణ(లోక్‌సత్తా), అంకన్న(పీడీఎస్‌యూ) తదితరులు మాట్లాడారు. కడప ఉక్కు పరిశ్రమ నిర్మాణం కోసం దశాబ్దానికి పైగా ఈ ప్రాంత ప్రజలు, ప్రజాసంఘాలు ఉద్యమాలు చేస్తున్నారని, ప్రభుత్వాలు హామీలిస్తూ శంకుస్థాపనలు చేస్తున్నారే తప్ప ఉక్కు పరిశ్రమ నిర్మాణంలో ముందడుగు పడలేదన్నారు. సంవత్సరాలు గడుస్తున్నకొద్దీ ఉత్పత్తి సామర్థ్యాన్ని కూడా తగ్గిస్తున్నాయన్నారు. కర్నూల్, కడప, అనంతపురం జిల్లాలకు మధ్యలో ఉన్న జమ్మలమడుగు వద్ద నిర్మించ తలపెట్టిన ఉక్కుపరిశ్రమ పూర్తయితేనే రాయలసీమ పారిశ్రామిక అభివృద్ధి సాధ్యమన్నారు. ఈ ప్రాంతంలో ఇంజనీరింగ్, డిగ్రీ, ఎంబీఏ, ఎంసీఏ, పాలిటెక్నిక్, ఐటీఐ పూర్తిచేసుకున్న విద్యార్థులు ఉద్యోగాల కోసం హైదరాబాద్, బెంగుళూరు, చెన్నై, గల్ఫ్, తదితర ప్రాంతాలకు వలస వెళుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కడప-బెంగుళూరు రైల్వేలైన్‌కు పది సంవత్సరాల క్రితమే నిధుల కేటాయింపు, భూసేకరణ చేశాయని, ఇందుకు ఆనాటి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆమోదం కూడా తెలిపాయన్నారు. ఆ మేరకు కడప, రాయచోటి, మదనపల్లె మీదుగా బెంగుళూరుకు అన్ని రకాలుగా ప్రణాళికలు కూడా పూర్తయ్యాయన్నారు. కానీ సహజంగా సీమ ప్రాంతంపై ఉన్న పాలకుల నిర్లక్ష్యం కారణంగా అది కూడా మధ్యలోనే ఆగిపోయిందన్నారు. కేవలం కడప నుండి పెండ్లిమర్రి వరకు మాత్రమే రైల్వేట్రాక్ పూర్తయి కడప నుండి నంద్యాల వరకు డెమో రైలు వస్తోందన్నారు. ఏదిఏమైనా కడప-బెంగుళూరు రైల్వే లైన్ పూర్తయితే ఈ ప్రాంతం ఆర్థిక, పారిశ్రామిక అభివృద్ధికి ఆస్కారం ఉంటుందన్నారు. కాగా కూటమి ప్రభుత్వం మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణకు పూనుకోవడం వలన ఈ ప్రాంత పేద, మధ్యతరగతి విద్యార్థులకు వైద్య విద్య అందని ద్రాక్షలాగా మారుతుందన్నారు. పైపెచ్చు వైద్యం కూడా పేదలకు కష్టం అవుతుందన్నారు. కూటమి ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చే విధంగా పలు పార్టీలు, ప్రజా సంఘాలతో ఉద్యమానికి శ్రీకారం చుడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు సీఆర్‌వీ ప్రసాద్, మహిళానాయకురాలు భాగ్యలక్ష్మి (సీపీఐ), బాబు (ఎన్ఎస్‌యూఐ), పలువురు నాయకులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి హ్యాండ్‌బాల్ పోటీల్లో
చిత్తూరు, కృష్ణా జిల్లాల విజయం



విజేత జట్లతో నిర్వాహకులు, అధికారులు

కలికిరి, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): కలికిరిలో మూడు రోజులపాటు జరిగిన రాష్ట్ర స్థాయి హ్యాండ్‌బాల్ పోటీల్లో అండర్-14 బాలుర విభాగంలో చిత్తూరు, బాలికల విభాగంలో కృష్ణా జిల్లాల జట్లు విజేతలుగా నిలిచాయి. ఆదివారం జరిగిన ఫైనల్స్‌లో విశాఖపట్నం బాలుర జట్టుతో తలపడిన చిత్తూరు జట్టు 9-4 గోల్స్ తేడాతో భారీ విజయం చేజిక్కించుకుంది. ప్రకాశం జిల్లా జట్టుతో తలపడిన కృష్ణా బాలికల జట్టు 6-3 స్కోర్‌తో ఘన విజయం సాధించింది. ముఖ్య అతిథిగా హాజరైన కలికిరి పంచాయతీ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు రెడ్డివారి యోగేష్ రెడ్డి విజేతలకు బహుమతులు అందజేశారు. అదే విధంగా రాష్ట్రంలోని 13ఉమ్మడి జిల్లాల నుంచి పోటీల్లో పాల్గొన్న ఉత్తమ ప్రతిభ కనబరిచిన 16 క్రీడాకారులను జాతీయ పోటీలకు ఎంపిక చేసినట్లు నిర్వాహకులు ప్రకటించారు. మూడు రోజులపాటు జరిగిన పోటీలకు హాజరైన దాదాపు 600 మంది క్రీడాకారులు, కోచ్‌లు, మేనేజర్లు, పీడీలకు వసతి, భోజన సౌకర్యం కల్పించిన యోగేష్ రెడ్డిని అభినందించారు. కార్యక్రమంలో ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి ఝాన్సీ, ఎన్టీఆర్ జిల్లా కార్యదర్శి శివప్రసాద్, క్రీడా పోటీల రాష్ట్ర పరిశీలకుడు వెంకటేశ్వరరావు, కలికిరి పీడీ రెడ్డివరప్రసాద్, పరిసర ఉన్నత పాఠశాలల హెచ్‌ఎంలు, పీడీలు, క్రీడాకారులు పాల్గొన్నారు.

భారతీయుల ఐక్యత కోసమే హిందూ సమ్మేళన సభ

- అచలానంద ఆశ్రమం పీఠాధిపతి విరజానందస్వామి



హిందూ సమ్మేళనంలో మాట్లాడుతున్న పీఠాధిపతి విరజానందస్వామి

బ్రహ్మంగారిమఠం, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): భారతీయులంతా ఐకమత్యంగా ఉండాలన్నదే హిందూ సమ్మేళన సభ లక్ష్యమని అచలానంద ఆశ్రమం పీఠాధిపతి విరజానందస్వామి తెలిపారు. ఆదివారం బ్రహ్మంగారిమఠంలో రాష్ట్ర స్వయం సేవక్ సంఘ్ మండల అధ్యక్షుడు అయ్యవు సురేశ్ ఆధ్వర్యంలో హిందూ సమ్మేళన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా పీఠాధిపతి విరజానందస్వామి, జగన్మాత ఈశ్వరీదేవి మఠం మఠాధిపతి వీర శివకుమారస్వామి, రాష్ట్ర స్వయం సేవక్ సంఘం నాయకులు సుధాకర్, రమాదేవి హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ హిందువులంతా ఒక తాటిపైకి వచ్చి కలిసి మెలిసి ఉండడానికే హిందూ సమ్మేళన కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందన్నారు. చిన్నారులు నిర్వహించిన నృత్యగీతాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమానికి చుట్టు పక్కల గ్రామాల ప్రజలు, రాజకీయనేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఉత్తమ సేవలకు ప్రతినిధి

- ఎంపీడీవో ఉద్యోగ విరమణ సభలో వక్తలు

పెద్దతిప్పసముద్రం నవంబరు 30(ఆంధ్రజ్యోతి): ఎంపీడీవో అబ్దుల్ కలాం ఆజాద్ 37ఏళ్లుగా వివిధ శాఖల్లో పని చేస్తూ ఉత్తమ సేవలకు ప్రతినిధిగా నిలిచారని వక్తలు అన్నారు. ఆదివారం పెద్దతిప్పసముద్రం ఎంపీడీఓగా ఉద్యోగ విరమణ పొందిన అబ్దుల్ కలాం ఆజాద్‌ను మండల అధికారులు, ప్రజాప్రతినిధులు, బంధువులు ఘనంగా సన్మానించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీ ఓను సన్మానించిన కార్యక్రమంలో వక్తలు మాట్లాడు తూ తన 37ఏళ్ల ఉద్యోగ సర్వీసులో ప్రజలకు ఎన్నో సేవలందించి ఉత్తమ అధికారిగా జిల్లా అధికారుల నుంచి ప్రశంసలు అందుకున్నారని, ఉన్నతాధికారుల ఆదేశాలను పాటిస్తూ ప్రజలకు సేవ చేయడం ద్వారా మంచి ఉద్యోగిగా ఎంతో పేరు సంపాదించుకున్నారన్నారు. సన్మాన గ్రహీత మాట్లాడుతూ ఉద్యోగ నిర్వహణలో సహకారం అందించిన ఉన్నతాధికారులకు, సహచర ఉద్యోగులకు, స్థానిక ప్రజాప్రతినిధులకు, ప్రజలకు కృతజ్ఞతలు తెలియచేశారు. విధి నిర్వహణలో అంకితభావంతో తన ఉద్యోగ సర్వీసును పూర్తి చేసుకున్నానన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీఓ ప్రతాప్‌రెడ్డి ఏఓ శ్రీదర్, కార్యదర్శులు, సర్పంచులు, కార్యాలయ సిబ్బంది, మాజీ జడ్పీటీసీ గూటం ఈశ్వరప్ప, బూర్లపల్లె సుధాకర్‌రెడ్డి బోర్ మెకానిక్ చంద్ర తదితరులు పాల్గొన్నారు.

ఇన్‌చార్జ్ ఎంపీడీవోగా ప్రతాప్‌రెడ్డి

ఇన్‌చార్జ్ ఎంపీడీఓ ప్రతాప్‌రెడ్డికి ఆదివారం అదనపు బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ ఎంపీడీఓగా విధులు నిర్వర్తిస్తున్న అబ్దుల్ కలాం ఆజాద్ ఆదివారం ఉద్యోగ విరమణ పొందిన నేపథ్యంలో ఆయనకు అదనపు బాధ్యతలు అప్పగించారు.

చర్యలు తీసుకుంటాం : సీఐ

అట్లూరు, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): స్థల వివాదం కేసులో ఇరువర్గాలపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని బద్వేలు రూరల్ సీఐ కృష్ణయ్య వెల్లడించారు. నవంబరు 24న స్థల వివాదంపై రెడ్డిపల్లె గ్రామానికి చెందిన ఆంజనేయులు, అయ్యప్పస్వామి ఆలయనిర్వాహకుడు మాలే నరసింహారెడ్డి ఇరువురు ఘర్షణపడ్డారు. ఇద్దరికీ గాయాలు కావడంతో అట్లూరు ఎస్ఐ రామక్రిష్ణ ఇరువురిపై కేసులు నమోదు చేశారు. కానీ అయ్యప్ప భక్తుడైన నరసింహారెడ్డికి తలకు దెబ్బతగలడంతో ఆయనకు మద్దతుగా ఆంజనేయులుపై చర్యలు తీసుకోవాలని ఆదివారం అట్లూరు క్రాస్ రోడ్డుపై అయ్యప్ప స్వాములు బైఠాయించి ధర్నా నిర్వహించారు. కార్యక్రమంలో గోపవరం ఎస్ఐ శ్రీకాంత్, డిప్యూటీ తహసీల్దారు శిరీషా, ఆర్ఐ రమణ, అయ్యప్ప భక్తులు పాల్గొన్నారు.

పార్టీని బలోపేతం చేయాలి



కలికిరిలో ప్రదర్శన చేస్తున్న కాంగ్రెస్ శ్రేణులు

కలికిరి, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీని జిల్లాలో బలోపేతం చేయడానికి నేతలు కృషి చేయాలని ఏఐసీసీ, ఏపీసీసీ పరిశీలకులు సూచించారు. గ్రామ స్థాయి నుంచి పార్టీ బలోపేతానికి సంస్థాగతంగా చర్యలు తీసుకోవాలని కోరారు. పీలేరు నియోజకవర్గంలో సంస్థాగత నిర్మాణ కార్యక్రమానికి నిర్వహించిన సమావేశంలో పాల్గొన్న ఏఐసీసీ పరిశీలకుడు కె.మహేంద్రన్, ఏపీసీసీ పరిశీలకుడు జంగా గౌతమ్, టీసీసీ రాష్ట్ర కార్యదర్శి రాకేష్ పార్టీని పునర్నిర్మాణానికి తీసుకోవలసిన చర్యల గురించి స్పష్టమైన మార్గదర్శకాలు జారీ చేశారు. నియోజకవర్గ ఇన్‌చార్జి సోమశేఖర్ రెడ్డి ఇప్పటికే పార్టీని సంస్థాగతంగా పటిష్టపరచడానికి తీసుకున్న చర్యలు గురించి వివరించారు. జిల్లా కాంగ్రెస్ అధ్యక్ష పదవికి దరఖాస్తు చేసుకోవాలని పరిశీలకులు సూచించారు. జిల్లా అధ్యక్షుడు గాజుల భాస్కర్ మాట్లాడుతూ జిల్లాలో పార్టీని పునర్నిర్మించాల్సి వుందన్నారు. మొదట కాంగ్రెస్ నేతలు నాలుగు రోడ్ల కూడలిలోని గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

ప్రజలకు పూర్తిగా ఉచిత వైద్యం

మదనపల్లె అర్బన్, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): పీపీపీ విధానంలో మెడికల్ కాలేజీలు అనుబంధ ఆస్పత్రులు పూర్తిగా ప్రభుత్వాధీనంలో ఉంటాయని, దీంతో ప్రజలకు పూర్తిగా ఉచిత వైద్యం అందుతుందని బీజేపీ జాతీయ నేత చల్లపల్లె నరసింహారెడ్డి అన్నారు. ఆదివారం సొసైటీ కాలనీలోని తన స్వగృహంలో నరసింహారెడ్డి మీడియాతో మాట్లాడుతూ ఆరోగ్య రంగంలో పూర్తిగా విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చి మదనపల్లె వైద్య కళాశాల మీద ప్రత్యేక దృష్టి నిలిపారన్నారు. కార్యక్రమంలో బీజేపీ నేతలు మెడికల్ ప్రాక్టీషనర్ రాష్ట్ర ఉపాధ్యక్షులు డాక్టర్ అజ్మతుల్లాఖాన్, విజయభారతి అధినేత డాక్టర్ ఎన్. సేతు, బర్నేపల్లె రవికుమార్, ఆకుల కృష్ణమూర్తి పాల్గొన్నారు.

చీరకు నిప్పంటుకుని వృద్ధురాలి మృతి

పోరుమామిళ్ల, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): గ్యాస్ స్టవ్‌పై వంట చేస్తుండగా ప్రమాదవశాత్తు చీరకు మంటలు అంటుకోవడంతో ఒళ్లంతా కాలిన గాయాలతో చికిత్స పొందుతూ కోనేటి నాగమ్మ (72) మృతి చెందిందని ఎస్ఐ కొండారెడ్డి తెలిపారు. మండలంలోని దాసరిపల్లె గ్రామానికి చెందిన కోనేటి నాగమ్మ శనివారం మధ్యాహ్నం 3గంటల సమయంలో గ్యాస్ స్టవ్‌పై వంట చేస్తుండగా ప్రమాదవశాత్తు మంటలు చీరకు అంటుకుని వళ్లంతా గాయాలయ్యాయి. వెంటనే కుటుంబ సభ్యులు ఆమెను పోరుమామిళ్ల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా మెరుగైన వైద్యం కోసం కడపకు తీసుకెళ్లారు. చికిత్స పొందుతూ ఆమె ఆదివారం ఉదయం మృతి చెందిందని తెలిపారు. మృతురాలి మనవడు తులసి వెంకటనారాయణ పిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

6న మల్లయ్యకొండ పనులకు బహిరంగ వేలం

- 3న హుండీ లెక్కింపు

తంబళ్లపల్లె, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన మల్లయ్యకొండ మల్లికార్జున స్వామి దేవస్థానంలో వివిధ పనులకు ఏడాది పాటు హక్కులను పొందడానికి ఈనెల 6న బహిరంగ వేలం నిర్వహించనున్నట్లు ఆలయ ఈవో మునిరాజ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. తలనీలాలు సేకరించుకునే హక్కు(ధరావత్తు రూ.1లక్ష), వాహనాల టోల్ గేట్ వసూలు హక్కు(ధరావత్తు రూ.1లక్ష), గౌరమ్మ ఆలయం, ఏనుగు మల్లమ్మ ఆలయం వద్ద పూజా సామగ్రి విక్రయించుకునేందుకు (ధరావత్తు రూ.50వేలు), వీరన్న గెవి వద్ద(ధరావత్తు రూ.10వేలు), దేవస్థానం వద్ద కొబ్బరి చిప్పలు సేకరించుకునేందుకు, కొండ పైన దుకాణాలకు గేటు వసూలు హక్కుకు (ధరావత్తు రూ.50వేలు), చెప్పులు పోగు చేసుకునే హక్కు(2026 ఫిబ్రవరి 14, 15, 16 మూడు రోజులు మాత్రమే, ధరావత్తు రూ.10వేలు)లకు వేలం నిర్వహించనున్నట్లు తెలిపారు. గతంలో హక్కు దక్కించుకుని దేవస్థానానికి బకాయి ఉన్న వారు వేలంలో పాల్గొనడానికి అనర్హులన్నారు. పాల్గొనదలచిన వారు ఆధార్‌కార్డు జిరాక్స్ కాపీ, సూచించిన ధరావత్తు చెల్లించి పాల్గొనాలని సూచించారు. ఈనెల 3వ తేదీన బుధవారం మల్ల య్యకొండ దేవస్థానంలో భక్తులు సమర్పించిన హుండీ కానుకల లెక్కింపు కార్యక్రమం ఉంటుందని, భక్తులు, కూటమి నేతలు హాజరు కావాలని ఈవో కోరారు.

స్థానిక సంస్థల్లో టీడీపీ విజయం సాధించాలి



అయ్యవారిపల్లె గ్రామస్థులతో మాట్లాడుతున్న శ్రీకాంత్

వాల్మీకిపురం, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): సీఎం నారా చంద్రబాబు ఆధ్వర్యంలో రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమ పతకాలు విజయవంతంగా నిర్వహిస్తుండడంతో ప్రజల్లో చైతన్యం తీసుకొచ్చి త్వరలో జరిగే స్థానిక ఎన్నికల్లో టీడీపీ ఘన విజయం సాధించేలా పార్టీ శ్రేణులు కృషి చేయాలని రాష్ట్ర మొదలియార్ కార్పొరేషన్ డైరెక్టర్ ఎం.శ్రీకాంత్ అన్నారు. ఆదివారం సాయంత్రం అయ్యవారిపల్లెలో మార్కెట్ కమిటీ చైర్మన్ కోనూరి చంద్రమౌళి, మండల పార్టీ అధ్యక్షుడు రామోదర్‌రెడ్డితో కలిసి ఆయన ప్రజలతో మాట్లాడుతూ ఎన్‌డీఏ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలన్నీ అమలు చేసిన ఘనత చంద్రబాబుకు దక్కుతుందన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ అభ్యర్థులు ఘన విజయం సాధించాలని ఆ దిశగా పార్టీ శ్రేణులంతా ఐక్యంగా టీడీపీ పటిష్టతకు కృషి చేయాలని కోరారు.

సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం

- యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు హరిప్రసాద్

పీలేరు రూరల్, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించడంలో ప్రభుత్వం నిర్లక్ష్య ధోరణి అవలంభిస్తోందని యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు హరిప్రసాద్, జాబీర్ ఆరోపించారు. ఆదివారం పీలేరులో యూటీఎఫ్ కార్యాలయాన్ని ప్రారంభించిన వారు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాకమునుపు ఉద్యోగ, ఉపాధ్యాయులకు అనేక హామీలు ఇచ్చిందని, వాటిని నమ్మి ప్రభుత్వ ఏర్పాటుకు ఎంతో శ్రమించామని, తీరా అధికారంలోకి వచ్చాక హామీలు నెరవేర్చడంలో తీవ్ర నిర్లక్ష్య ధోరణి ప్రదర్శిస్తోందన్నారు. వైసీపీ ప్రభుత్వం తమపై కక్షపూరితంగా వ్యవహరించిందని, ఉద్యోగులకు చెల్లించాల్సిన ఆర్థిక బకాయిలు చెల్లించకుండా తీవ్ర వేధింపులకు గురి చేసిందన్నారు. రివర్స్ పీఆర్‌సీతో ఉద్యోగులను జగన్ ప్రభుత్వం దగాచేసిందని విమర్శించారు. ఉపాధ్యాయులకు బోధనేతర పనుల నుంచి విముక్తి కల్పించాలని డిమాండ్ చేశారు. 25 ఏళ్లకు పైగా బోధనలో అనుభవం ఉన్న వారిని ఇప్పుడు టెట్ రాయమనడం సహేతుకం కాదన్నారు. కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయకపోతే ప్రభుత్వంపై పోరాటాలకు సిద్ధం అవుతామని వారు హెచ్చరించారు. సమావేశంలో ఉమ్మడి చిత్తూరు జిల్లా గౌరవాధ్యక్షుడు రాధాక్రిష్ణ, యూనియన్ నేతల చంద్రశేఖర్, అక్రంబాషా, భాస్కర్ రెడ్డి, ఆదినారాయణ, విజయకుమార్, వెంకట్రమణ, డీవీ. రెడ్డి, ఉదయ్‌కిరణ్, ప్రభాకర్, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.



పీలేరులో యూటీఎఫ్ కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు

పుష్పగిరిలో బ్రహ్మసూత్ర శివలింగాలు



గంగాధరేశ్వర స్వామి ఆలయం

వల్లూరు, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): మండలంలో అత్యంత ప్రసిద్ధి చెందిన పుష్పగిరిలో వెలసిన లక్ష్మీచెన్నకేశవస్వామి ఆలయ గాలిగోపురం పక్కనున్న గంగాధరేశ్వర స్వామి ఆలయంలోని శివలింగానికి, అలాగే శివాలపల్లెలోని కాశీవిశ్వేశ్వరస్వామి ఆలయ శివలింగానికి బ్రహ్మసూత్రం ఉన్నట్లు తన పరిశోధనలో తేలిందని రచయిత, చరిత్రకారుడు బొమ్మిశెట్టి రమేశ్ తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ పురాతన శివాలయాల్లో శివలింగంపై నిలువు గీతలుంటాయన్నారు. ఇవి చాలా అత్యంత అరుదైనవని, అన్ని శివాలయాల్లోని శివలింగాలకు ఈ విధమైన గీతలుండవని వివరించారు. ఇలా శివలింగంపై గీతలుండడాన్ని బ్రహ్మసూత్రం అంటారని, బ్రహ్మసూత్రాలను వేదసూత్రాలని కూడా అంటారని తెలిపారు. బ్రహ్మసూత్రమంటే అంతిమ వాస్తవం, మోక్షమార్గం అనే అర్థాలున్నాయని, బ్రహ్మసూత్రాలపై ఆదిశంకరాచార్యులు అనేక వివరణలిచ్చారని వివరించారు. విముక్తి పొందిన ఆత్మకు, అంతర్గత జ్ఞానం, బలం ఉంటాయని, దుఃఖం నుంచి విముక్తి పొందుతారని బ్రహ్మసూత్రం వివరిస్తుందన్నారు. 555 బ్రహ్మ సూత్రాలుయన్నారు. వెయ్యిసార్లు ఒక శివాలయానికి వెళ్తే ఎంత ఫలితం వస్తుందో ఒక్క బ్రహ్మసూత్ర శివలింగాన్ని దర్శిస్తే అంతే ఫలితం వస్తుందన్నారు, శివాలపల్లె కాశీవిశ్వేశ్వరస్వామి ఆలయంలోని శివలింగానికి బ్రహ్మసూత్రం మధ్యలో ఒక నిలువాటి స్తూపాకార గీతుంటే దానికి కొంచెం కిందగా పార్శ్వ భాగాల్లో వంపు తిరిగిన గీతలున్నాయని, అలాగే గంగాధరేశ్వరస్వామి ఆలయంలోని బ్రహ్మ సూత్ర శివలింగం మధ్యలో స్తూపాకార గీతుంటే దానికి సమానంగా పార్శ్వ భాగాల్లో కోణీయ నిలువు రేఖలు, వాటికి కింది తలంలో వంపు తిరిగిన గీతలున్నాయన్నారు.



కాశీవిశ్వేశ్వరస్వామి ఆలయం

చెరువుల అనుసంధానంతో జలకళ



వేంపల్లెచెరువు మొరవ కాల్వను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే షాజహాన్‌బాష

మదనపల్లె టౌన్, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలోని చెరువులను అనుసంధానం చేస్తూ అన్ని చెరువులకు జలకళ తెప్పిస్తామని ఎమ్మెల్యే షాజహాన్ బాష అన్నారు. ఆదివారం వేంపల్లె చెరువు మొరవ కాల్వను ఇంజనీరింగ్ అధికారులతో కలిసి ఎమ్మెల్యే పరిశీలించారు. చెరువు మొరవ కాల్వ పూడిపోయి వుండడంతో వెంటనే ఎక్స్‌కవేటర్ తెప్పించి కాల్వలో పూడికను ఎత్తివేయించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ వేంపల్లె చెరువు మొరవ పోతోందని, ఈ నీటిని దిగువ భాగంలో వుండే రెడ్ల చెరువుకు మళ్లిస్తున్నామన్నారు. అనంతరం రెడ్లచెరువు నుంచి గుర్రంచెరువుకు మళ్లిస్తామన్నారు. వర్షపు నీరు వృధా కాకుండా ఎక్కడికక్కడ నిల్వ ఉంచేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. భూగర్భ జలాలు కూడా పెంచేలా కృషి చేస్తామన్నారు. జలవనరుల శాఖ ఏఈ రాయలబాబు రాజేంద్రప్రసాద్, గ్రామస్థులు పాల్గొన్నారు.

సకాలంలో సమాచారం ఇచ్చిఉంటే...

విద్యుదాఘాతం సంఘటనపై ఏఈ

కలికిరి, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): పందిరి వేసే ముందు సిద్దయ్య తమ సిబ్బందికి సమాచారం ఇచ్చి ఉంటే కనీసం తాత్కాలికంగా లైన్ క్లియరెన్స్ ఇచ్చేవారమని ఏఈ ముజిబుర్ రహ్మాన్ తెలిపారు. మర్రికుంటపల్లె విద్యుదాఘాతం ఘటనలో ముగ్గురు గాయపడటం, ఏఈ ముజిబుర్ రహ్మాన్, లైన్‌మ్యాన్ గోపిపై పోలీసు స్టేషన్‌లో కేసు నమోదైన విషయం తెలిసిందే. దీంతో ఏఈ మాట్లాడుతూ మర్రికుంటపల్లెలో పి.సిద్దయ్య ఇంటి ముందు 30 ఏళ్లగా 11 కేవీ విద్యుత్ లైను వుందన్నారు. గ్రామస్తుల అభ్యర్థనపై గతంలో విద్యుత్ లైను ఎత్తు పెంచడం కోసం స్తంభాలు మార్చడానికి ప్రయత్నించామన్నారు. అయితే తన ఇంటి ముందు స్తంభం నాటేందుకు వీలు లేదని అప్పట్లో సిద్దయ్య అడ్డుపడ్డాడని, మరో చోట స్తంభాన్ని పాతడానికి ప్రయత్నించగా ఇతర గ్రామస్తులు అభ్యంతరం తెలపడంతో వాయిదా పడిందన్నారు. ఇలా వుండగానే సిద్దయ్య తన ఇంటి ముందు నిర్మాణం చేపట్టడంతో ఇంటి నిర్మాణం ఎత్తు పెరిగి విద్యుత్ లైను ఎత్తు తగ్గిందన్నారు. పక్కనే వున్న మరో స్తంభం లైను ఎత్తులో వున్న విషయం గమనించాలని కోరారు. దీంతో మళ్లీ స్తంభాన్ని మార్చే ప్రయత్నం చేయగా మళ్లీ సిద్దయ్య అభ్యంతరం చెప్పారని గుర్తు చేశారు. ఈ నేపథ్యంలో తక్కువ ఎత్తులో వున్న విద్యుత్ లైను కింద ఇంటి ముందు పందిరి వేసే క్రమంలో ప్రమాదం జరిగిందన్నారు. పందిరి వేసే ముందు కూడా సిద్దయ్య తమ సిబ్బందికి ఎలాంటి సమాచారం ఇవ్వలేదని ఏఈ వివరించారు. సమాచారం అందజేసుంటే కనీసం తాత్కాలికంగా లైన్ క్లియరెన్స్ ఇచ్చేవారమని తెలిపారు. ఈ సంఘటనలో విద్యుత్ శాఖ తప్పిదాలు లేవని ఆయన స్పష్టం చేశారు.

జడివాన.....

- జనావాసాలకు తలెత్తిన ఇబ్బంది
- దిత్వా తుఫాన్‌తో పంటలకు నష్టం

ములకలచెరువు, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): దిత్వా తుఫాను కారణంగా ములకలచెరువులో ఆదివారం తెల్లవారు జామున నుంచి ఎడతెరపి లేకుండా జడివాన కురుస్తూనే ఉంది. దీంతో జనజీవనం అస్తవ్యస్తమైంది. ప్రజలు ఇళ్లకే పరిమితమయ్యారు. వర్షంతో ములకలచెరువులో వీధులన్నీ బురదమయమయ్యాయి. ముఖ్యంగా మార్కెట్ యార్డు, ఆర్టీసీ బస్టాండు ప్రాంగణం, ప్రభుత్వాస్పత్రికి వెళ్లే ప్రధాన ద్వారం తదితర ప్రాంతాలు రొచ్చుగా మారడంతో రైతులు, స్థానికులు రాకపోకల్లో ఇబ్బందులు పడాల్సి వచ్చింది.

దిత్వా తుఫాన్‌తో చిరుజల్లులు

గుర్రంకొండ, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): మండలంలో అర్ధరాత్రి నుంచి ఈదురుగాలులతో కూడిన చిరుజల్లులు కురిశాయి. దిత్వా తుఫాన్ ప్రభావం కారణంగా కురుస్తున్న చిరుజల్లులతో జనజీవనం బయటకు రావడానికి ఇబ్బందులు పడుతున్నారు. తుఫాన్ ప్రభావంతో టమోటా కాయలు కోయడానికి కూలీలు రాక రైతులు అష్టకష్టాలు పడుతున్నారు. దీంతో టమోటా, బొప్పాయి కాయలు, పూలు, ఇతర కూరగాయల పంటలకు తీవ్రనష్టం వాట్లినుంది. చిరుజల్లులు ఎడతెరిపి లేకుండా కురుస్తుండడంతో జనజీవనం ఇళ్లకే పరిమితమయ్యారు.

ముసురుకున్న జడివాన

పెద్దమండ్యం, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): తుఫాన్ కారణంగా ఆదివారం పెద్దమండ్యం మండలంలో ముసురుతో కూడిన జడివాన కురిసింది. ఉదయం నుంచీ రాత్రి వరుకు చలి ఈదులు గాలులతో కూడిన ముసురు చిరు జల్లులు కురుస్తుండడంతో ప్రజలు ఇళ్లకే పరమితమయ్యారు. తుఫాన్ కారణంగా వరి, టమోటా పంటలు పాడవుతాయని ఆ రైతులు ఆందోళనం చెందారు. తుఫాన్ వర్షంతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ తేజస్వి, ఎంపీడీఓ శ్రీధర్‌రావు తెలిపారు.

ఇది జాతీయ రహదారే...!

ముంబై - చెన్నై జాతీయ రహదారి గ్రామీణ రోడ్డును తలపిస్తోంది. ములకలచెరువులోని రెండు కిలో మీటర్ల మేర ఉన్న జాతీయ రహదారికి ఇరువైపులా భారీగా మట్టి పేరుకుపోయింది. తుఫాను కారణంగా కురుస్తున్న వర్షానికి జాతీయ రహదారి రెండు వైపులా ఉన్న మట్టి రొచ్చుగా మారింది. దీంతో ఇది జాతీయ రహదారానని అనుమానం కలుగుతోందని స్థానికులు అంటున్నారు. ద్విచక్రవాహనదారులు రొచ్చుగా మారిన రోడ్డుపై రాకపోలు సాగించడానికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పాదచారులు కూడా అవస్థలు పడుతున్నారు. అసలు ఇది జాతీయ రహదారా లేదా గ్రామీణ రోడ్డానని చర్చించుకుంటున్నారు. సంబంధిత అధికారులు ఇప్పటికైనా చొరవ తీసుకుని రోడ్డుకు ఇరువైపులా పేరుకుపోయి రొచ్చుగా మారిన మట్టిని తొలగించాలని స్థానికులు, వాహనదారులు కోరుతున్నారు.





బురదమయమైన మార్కెట్ యార్డు ప్రధాన ద్వారం - గ్రామీణ రోడ్డును తలపిస్తున్న ముంబై - చెన్నై జాతీయ రహదారి

రెడ్డెమ్మతల్లికి ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో అమ్మవారు

గుర్రంకొండ, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): సంతానలక్ష్మీగా పేరుగాంచిన రెడ్డెమ్మకొండ ఆలయంలో ఆదివారం అమ్మవారికి అర్చకులు ప్రత్యేక పూజలను నిర్వహించారు. ఉదయాన్నే ఆలయంలో అమ్మవారిని పరిమళభరిత పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించి విశేష పూజలు చేశారు. సంతానం లేని దంపతులు సంతానం కోసం ఆకుపసురును తాగి ఆలయంలో వరపడ్డారు. అమ్మవారి కృపతో సంతానం పొందిన మహిళలు మొక్కు తీర్చుకునేందుకు అధిక సంఖ్యలో వచ్చి కొబ్బరి కాయలను సమర్పించి తీర్థప్రసాదాలను స్వీకరించారు. ఛైర్మన్ రాజన్ననాయుడు, ఈఓ మంజుల, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రశాంతంగా నమూనా పరీక్ష

పీలేరు రూరల్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): స్కూల్ అసిస్టెంట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నేషనల్ మీన్స్ కం మెరిట్ ష్కాలర్ షిప్ నమూనా పరీక్ష ప్రశాంత వాతావరణంలో నిర్వహించారు. ఏర్పాటు చేసిన సమావేశంలో చిత్తూరు, అన్నమయ్య జిల్లాల సంఘం అధ్యక్షులు రహమత్ బాషా, వేణుగోపాల్ రెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా నమూనా పరీక్ష నిర్వహిస్తున్నామన్నారు. భవిష్యత్‌లో జరిగే పోటీ పరీక్షల్లో పాల్గొనేందుకు ఇది మొదటి మెట్టుగా ఉపయోగ పగపడుతుందన్నారు. నేషనల్ మీన్స్ కం మెరిట్ పరీక్షలో అర్హత సాధించిన విద్యార్థులకు కేంద్ర ప్రభుత్వం 9, 10 తరగతులు, ఇంటర్ రెండేళ్లకు ఏడాదికి రూ. 15 వేలు చొప్పున ష్కాలర్ షిప్ ఇస్తుందని తెలిపారు. ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 12 వరకూ పరీక్ష నిర్వహించారు. కార్యక్రమంలో స్కూల్ అసిస్టెంట్ అసోసియేషన్ నేతలు నాగరాజరెడ్డి, శేషాద్రి రెడ్డి, దివాకర్, సుదర్శన్ తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరానికి అనూహ్య స్పందన

పీలేరు రూరల్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): స్థానిక శ్రీచైతన్య జూనియర్ కళాశాలలో నిర్వహించిన ఉచిత న్యూరో వైద్య శిబిరానికి అనూహ్య స్పందన లభించింది. ఆదివారం గుర్రం రామక్రిష్ణారెడ్డి వర్ధంతి పురస్కరించుకుని అడ్వాన్స్‌డ్ న్యూరో అండ్ స్పైన్ సెంటర్ ఆధ్వర్యంలో వైద్య శిబిరం నిర్వహించారు. 150 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. శిబిరంలో డాక్టర్ కే. వినూత ప్రసాద్ రెడ్డి, రామలింగారెడ్డి, బలరామిరెడ్డి, రామశేఖర్ రెడ్డి, సురేంద్రరెడ్డి, చక్రధర్ తదితరులు పాల్గొన్నారు.

దాతల సహకారం అభినందనీయం

కలకడ, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): మానవత సేవా సంస్థ అభివృద్ధికి దాతలు అందిస్తున్న సహకారం అభినందనీయమని ఆ సంస్థ ప్రతినిధులు అన్నారు. కలకడలో ఆదివారం జరిగిన సమీక్షలో వారు మాట్లాడుతూ మండల పాఠశాలల్లోని విద్యార్థుల్లో ప్రమాణాలు, మానవీయ, నైతిక విలువలు పెంపొందేలా త్వరలో కార్యక్రమాలు చేపట్టనున్నట్లు తెలిపారు. వివిధ అంశాల్లో పోటీ పరీక్షలు నిర్వహించి బహుమతులు అందజేస్తామన్నారు. కార్యాలయ ప్రవేశ ఆర్చి, ప్రహరీ నిర్మాణంపై చర్చించారు. దాతలు కె.లక్ష్మిరెడ్డి, ఆశోక్‌కుమార్‌రెడ్డి, కుప్పా స్వామినాయుడు, భానుప్రసాద్ 25 కుర్చీలను విరాళంగా ఇచ్చారు. గంగాద్రినాయుడు, శ్రీనివాసులురెడ్డి, వై.వి.రమణ, సయ్యద్‌సాబ్‌ఖాన్, ఖాజపీర్, పి.వి.నాయుడు, లక్ష్మన్న, వెంకటసుబ్బయ్య, పి.వి.రమణ, భాస్కర్‌నాయుడు పాల్గొన్నారు.



టీడీపీ నేత రామచంద్ర గుండెపోటుతో మృతి



రామసముద్రం, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): టీడీపీ సీనియర్ నేత మేస్త్రీ రామచంద్ర(65) ఆదివారం గుండెపోటుతో మృతి చెందాడు. ఛాతి నెప్పి రావడంతో పుంగనూరు ఆస్పత్రికి తరలించగా అక్కడి వైద్యులు మదనపల్లెకు రెఫర్ చేశారు. అయితే మదనపల్లెకు వెళ్లేలోపే మార్గమధ్యలో రామచంద్ర తుది శ్వాస వదిలినట్లు కుటుంబీకులు తెలిపారు. రామచంద్ర ఆకస్మిక మృతి పట్ల పలువురు దిగ్భ్రాంతి చెందారు. రామచంద్ర మరణం పార్టీకి తీరని లోటని వీరి కుటుంబానికి పార్టీ అన్ని విధాలా అండగా ఉంటుందని మండల పార్టీ అధ్యక్షుడు విజయకుమార్‌గౌడ్ ప్రగాఢ సానుభూతి తెలిపారు.

95 మంది ఉద్యోగాలకు ఎంపిక

మదనపల్లె టౌన్, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): స్థానిక ఆదిత్య ఇంజనీరింగ్ కళాశాలలో నిర్వహించిన క్యాంపస్ ఇంటర్వ్యూలో 95 మంది విద్యార్థులు ఉద్యోగాలకు ఎంపికయ్యారని కళాశాల డైరెక్టర్ రామలింగారెడ్డి పేర్కొన్నారు. ఆదివారం ఆదిత్య ఇంజనీరింగ్ కళాశాలలో బెంగళూరుకు చెందిన టాటా ఎలక్ట్రానిక్స్ సంస్థ నిర్వహించిన క్యాంపస్ ఇంటర్వ్యూలో ఫైనల్ విద్యార్థులు ప్రతిభ చూపారు. వీరికి వార్షిక వేతనంగా రూ.3.5లక్షలు ఇస్తారన్నారు. వారిని ప్రిన్సిపాల్ రాయుడు, ప్లేస్‌మెంట్ ఆఫీసర్ మనోజ్‌కుమార్, అధ్యాపకులు అభినందించారు.

జిల్లా ప్రకటనను గౌరవించకపోవడం దారుణం

మీడియా సమావేశంలో టీడీపీ నేతలు



సమావేశంలో మాట్లాడుతున్న కౌన్సిలర్లు, మాజీ కౌన్సిలర్లు, టీడీపీ నేతలు

మదనపల్లె, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): వైసీపీ సాధించలేని మదనపల్లె జిల్లాను కూటమి ప్రభుత్వం సాధించిందని దాన్ని గౌరవించక పోవడం దారుణమని టీడీపీ నేతలు దుయ్యబట్టారు. సైదాపేటలోని ఎమ్మెల్యే కార్యాలయంలో ఆదివారం మీడియా సమావేశంలో వారు మాట్లాడుతూ జిల్లా ఏర్పాటు ప్రకటనలో వైసీపీ మినహా అన్ని రాజకీయ పార్టీలు, కుల, ప్రజాసంఘాల ఉద్యమవీరుల కష్టం దాగివుందని, దీన్ని గౌరవించలేని దుస్థితి వైసీపీది అంటూ కౌన్సిలర్లు, మాజీకౌన్సిలర్లు, టీడీపీ నేతలు, కౌన్సిలర్లు విమర్శించారు. 2022లో వైసీపీ ప్రభుత్వం జిల్లాల పునర్విభజనకు శ్రీకారం చుట్టింది. ఎన్నో ఏళ్లగా మదనపల్లె వాసులు కోరుతున్న జిల్లాగా మదనపల్లెను చేయకుండా మరోచోటికి తరలించడాన్ని వారు తప్పుపట్టారు. శనివారం కౌన్సిల్ సమావేశంలో కనీసం ధన్యవాదాలు తెలిపేందుకు కూడా వైసీపీ కౌన్సిలర్లు ఇష్టపడకపోవడాన్ని వారు ఖండించారు. టీడీపీ కౌన్సిలర్ పి.తులసి, టీడీపీ మద్దతు కైన్సిలర్లు ఎస్.కరీముల్లా, ఎం.నాగార్జునబాబు హర్షం వ్యక్తం చేస్తూ తీర్మానం చేసే ప్రయత్నాన్ని అడ్డుకోవడం ఏమిటని వారు ప్రశ్నించారు. సమావేశంలో కౌన్సిలర్లు పి.తులసి, ఎస్.కరీముల్లా, మాజీ కౌన్సిలర్లు ఎస్.బాబునాయుడు, ఆర్.నీలకంఠ, తలారి రాధ, సాకే లక్ష్మిదేవి, పి.భావన, మహాలక్ష్మి, వెంకటేశ్వరస్వామి ఆలయ ఛైర్మన్ గంగారపు నవీన్‌చౌదరి, ఆర్.జె.వెంకటేష్, బీసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మోడెం సిద్దప్ప, సుధాకర్, విజయమ్మ పాల్గొన్నారు.

బూత్ స్థాయిలో బలోపేతమే లక్ష్యం



గుమ్మసముద్రం టీడీపీ నేతలతో సమావేశమైన సిద్దప్ప

బి.కొత్తకోట, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలో బూత్ స్థాయిలో టీడీపీ బలోపేతమే లక్ష్యంగా పనిచేయాలని రాష్ట్ర టీడీపీ బీసీ సెల్ ఉపాధ్యక్షుడు మోడెం సిద్దప్ప పేర్కొన్నారు. ఆదివారం గుమ్మసముద్రంలో టీడీపీ నేతలతో సిద్దప్ప సమావేశమైన ఆయన మాట్లాడుతూ బూత్ నెంబర్లు 115, 157, 171, 173 పరిధిలో టీడీపీ బలోపేతం చేయాలని పార్టీ అధిష్టానం తనకు సూచించిందని, ఇందులో భాగంగా ముఖ్య నేతలతో సమావేశం నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో కె.నాగరాజు, గడ్డం సురేష్, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.



రొంపిచెర్ల, పులిచెర్ల మండలాలను పీలేరులో కలపాలి

బీజేపీ జాతీయ కౌన్సిల్ సభ్యుడు చంద్రశేఖర రెడ్డి



పీలేరు, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): పుంగనూరు నియోజకవర్గంలోని రొంపిచెర్ల, పులిచెర్ల మండలాలను పీలేరు రెవెన్యూ డివిజన్‌లోకి కలపాలని బీజేపీ జాతీయ కౌన్సిల్ సభ్యుడు చంద్రశేఖర రెడ్డి రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పీలేరులో ఆయన ఆదివారం విలేకరులతో మాట్లాడుతూ ప్రజల ఆకాంక్షలు, అవసరాలకు అనుగుణంగా కూటమి ప్రభుత్వం కొత్త జిల్లాలు, కొత్త రెవెన్యూ డివిజన్‌లు ఏర్పాటు చేయడం ఆహ్వానించదగ్గ విషయమన్నారు. అయితే కొత్తగా ఏర్పాటు చేయనున్న పీలేరు రెవెన్యూ డివిజన్‌లోకి పీలేరు నుంచి కేవలం 15 కిలోమీటర్ల దూరంలో ఉన్న రొంపిచెర్ల, పులిచెర్ల మండలాలను కలపకపోవడం అభ్యంతరకరమన్నారు. ఆ రెండు మండలాల ప్రజలు పీలేరుకు చేరుకోవడం వీలుంటుందని, చిత్తూరుకు వెళ్లాలంటే 60 కిలోమీటర్లు ప్రయాణించాల్సి వస్తోందన్నారు. ఆ రెండు మండలాల ప్రజల అవస్థలను గమనించి వాటిని పీలేరు రెవెన్యూ డివిజన్‌లోకి కలపాలన్నారు. కొత్త జిల్లాలు, కొత్త రెవెన్యూ డివిజన్ల ఏర్పాటుపై అభ్యంతరాలు తెలిపేందుకు ప్రభుత్వం ఇచ్చిన ఒక నెల సమయంలో తాము ఆ రెండు మండలాల ప్రజలతో పెద్దఎత్తున ఉద్యమించనున్నట్లు తెలిపారు.

ఏపీఐఐసీ డైరెక్టర్‌కు ఘన సన్మానం



ఏపీఐఐసీ డైరెక్టర్ మైఫోర్స్ మహేష్‌ను అభినందిస్తున్న జనసైనికులు

మదనపల్లె, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): ఏపీఐఐసీ డైరెక్టర్‌గా ప్రమాణం చేసిన జనసేన నేత మైఫోర్స్ మహేష్‌ను పార్టీ శ్రేణులు సన్మానించారు. జనసేన రాష్ట్ర సంయుక్త కార్యదర్శిగా కొనసాగుతున్న మైఫోర్స్ మహేష్‌ను ఏపీఐఐసీ డైరెక్టర్‌గా ప్రభుత్వం నియమించింది. విజయవాడలో ప్రమాణం చేసి, ఆదివారం మదనపల్లెకు చేరుకున్న ఆయనకు ఆపార్టీ నేతలు అమరనారాయణ, ఎస్.హరినాథ్, భవ్య కిశోర్, రామ్మూర్తి ఆధ్వర్యంలో స్కూటర్ ర్యాలీతో స్వాగతం పలికారు. ఇండస్ట్రియల్ ఎస్టేట్ నుంచి సాగినర్యాలీ గొల్లపల్లెలోని పార్టీ కార్యాలయానికి చేరుకుంది. అనంతరం మహేష్‌కు అభినందన సభ నిర్వహించి సన్మానించారు. కార్యక్రమంలో జనసేన నేతలు ఆకిపాటి సుభాషిణి, నక్క గోపీనాథ్, సుధాకర్, మల్లికార్జున్, సందీప్‌రెడ్డి, మధు రాయల్, నాగేంద్ర, మనోజ్, మదనపల్లె, తంబళ్లపల్లె, పీలేరు, పుంగనూరు నియోజకవర్గ జనసేన నేతలు పాల్గొన్నారు.

వంతెన నిర్మాణానికి కృషి

ములకలచెరువు, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): మండలంలోని కాల్వపల్లె సమీప పాపాఘ్నిపై వంతెన నిర్మించి ప్రజలు రాకపోకలు సాగించడానికి పడుతున్న కష్టాలను తీరుస్తానని తంబళ్లపల్లె నియోజకవర్గ జనసేన పార్టీ ఇన్‌చార్జి పోతుల సాయినాథ్ హామీ ఇచ్చారు. కాలువపల్లె పంచాయతీ బొల్లవారిపల్లెలో ఆదివారం జరిగిన గంగమ్మ తల్లి ప్రథమ వార్షికోత్సవ పూజా కార్యక్రమంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ ఏటా వర్షాకాలంలో పాపాఘ్ని ప్రవహిస్తుడడంతో ఏరు నుంచి తమ గ్రామానికి రాకపోకలు సాగించడానికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని గ్రామస్తులు తెలియజేశారు సమస్యను అధికారుల దృష్టికి తీసుకెళ్లి పాపాఘ్నిపై వంతెన నిర్మించి సమస్యను పరిష్కరిస్తానన్నారు. ఆదర్శ్, గౌతంనంద, పూజారి సురేంద్ర, సుదర్శన్, అనీల్, చంద్రమోహన్, మల్లెం నాని అర్జున్, రాకేష్, నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.



సత్ప్రవర్తనతో మెలగాలి

తంబళ్లపల్లె, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): రౌడీ షీటర్లు పాత కక్షలకు స్వస్తి చెప్పి సత్ప్రవర్తనతో మెలగాలని ఎస్ఐ ఉమామహేశ్వరరెడ్డి సూచించారు. పోలీసు ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఆదివారం తంబళ్లపల్లె పోలీస్‌స్టేషన్‌లో పాత నేరస్తులు, రౌడీ షీటర్లు, డీసీ, సస్పెక్ట్‌లకు కౌన్సెలింగ్ నిర్వహించారు. అసాంఘిక కార్యకలాపాలు కొనసాగించే వారిపై ప్రత్యేక నిఘా ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఏఎస్ఐ నజీర్ బాష, కానిస్టేబుళ్లు పాల్గొన్నారు.

పట్టుబడిన వ్యక్తి దొంగ కాదు

పీలేరు రూరల్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): స్థానిక నాగిరెడ్డికాలనీలో శనివారం రాత్రి స్థానికులకు పట్టుబడిన వ్యక్తి దొంగ కాదని పీలేరు ఎస్ఐ లోకేష్ తెలిపారు. శనివారం రాత్రి 9 గంటలకు నాగిరెడ్డికాలనీ వాసి హరిప్రసాద్ నాయుడు భార్య మెడలో బంగారు చైన్ లాక్కెళ్లిన ఘటనలో స్థానికులు అక్కడే స్కూటీపై కనపడిన వ్యక్తిని పట్టుకుని కట్టేసి పోలీసులకు అప్పగించారు. అయితే పోలీస్ విచారణలో అతను దొంగకాదని నిర్ధారించారు. దీంతో అతడిని, స్వాధీనం చేసుకున్న స్కూటీని ఇచ్చి పంపినట్లు ఎస్ఐ తెలిపారు.

శత జయంత్యుత్సవాలు జయప్రదం చేయండి

మదనపల్లె అర్బన్, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): సీపీఐ శత జయంత్యుత్సవాలు జయప్రదం చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి మహేష్ అన్నారు. ఆదివారం నిర్వహించిన సీపీఐ మదనపల్లె నియోజకవర్గం కార్యవర్గ సమావేశంలో జిల్లా కార్యదర్శి మహేష్, సహాయకార్యదర్శి కృష్ణప్ప మాట్లాడుతూ రైతాంగం, కార్మిక సమస్యలపై రాజీలేని పోరాటాలు చేసినట్లు చెప్పారు. దున్నేవాడిదే భూమి అని, భూసంస్కర్ణ చట్టాలు సాధించినట్లు చెప్పారు. 29 రాష్ట్రాల నుంచి సీపీఐ నేతలు, ప్రజలు హాజరవుతారన్నారు. దేశంలో రాజ్యాంగం కాపాడుకోవాలంటే ఉద్యమాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు.

యువత డ్రగ్స్‌కు దూరంగా ఉండాలి

తంబళ్లపల్లె, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు, యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండి ఎంచుకున్న లక్ష్యం వైపు ప్రయాణించాలని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ సుధాకర్ అన్నారు. ఎన్ఎస్ఎస్ స్పెషల్ క్యాంపులో భాగంగా ఆదివారం పంచాలమర్రిలో పొగాకు, డ్రగ్స్, సైబర్ నేరాలు, మత్తు పదార్థాల వినియోగంతో కలిగే అనర్థాలను విద్యార్థులకు వివరించారు. ఆయన మాట్లాడుతూ యువత చెడు అలవాటుకు అలవాటు పడి బంగారు భవిష్యత్తును నాశనం చేసుకుంటున్నారన్నారు. ఎన్ఎస్ఎస్ కో ఆర్డినేటర్ చంద్రశేఖర్, అధ్యాపకులు వెంకట్రమణ, విద్యార్థులు పాల్గొన్నారు.

కరాటే పోటీల్లో పీలేరు విద్యార్థుల ప్రతిభ



బెల్టులు సాధించిన విద్యార్థులతో మాస్టర్ దామోదర్

పీలేరు, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): పీలేరు రాజీవ్ నగర్ కాలనీలోని జేకేడీ కుంగ్‌ఫూ ఇన్‌స్టిట్యూట్‌లో ఆదివారం జరిగిన పోటీల్లో పీలేరు విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరిచారు. ఎల్లో బెల్ట్ విభాగంలో పహల్, సిద్దార్థ, సోఫియాన్, ఫిర్దౌస్, నిఖిల్, నస్రీన్, తస్రీన్, ఆరెంజ్ బెల్ట్ విభాగంలో కరిష్మా, జాస్నిక, వేదశ్రీ, ముఖేశ్, రెడ్డినిఖిల్, మోక్షిత ఉత్తమ ప్రతిభ కనబరిచారు. వారికి కుంగ్‌ఫూ మాస్టర్ దామోదర్ ఆయా బెల్టులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దారు అబ్దుల్ ఖాదర్, తదితరులు పాల్గొన్నారు.